తీన్మార్
తెలుగు దినపత్రిక

# ఇక మావోయిస్టులు చరిత్రేనా

మావోయిస్టులను అంతం చేస్తాం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అయితే తమను అరికట్టేందుకు చేపట్టిన ఆపరేషన్ కగార్ ను అడ్డుకుంటామని మావోయిస్టులు అంటున్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వానికి అంతర్గత భద్రత విషయంలో కంట్లో నలుసుగా మారింది మావోయిస్టు పార్టీ. దేశ అభివృద్ధికి మావోలు ఆటంకం అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంటే, దేశ సంపదను ప్రజలకు పంచకుండా గంప గుత్తగా ఒకరిద్దరు పెట్టుబడి దారుల చేతుల్లో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని మావోయిస్టు పార్టీ ఆరోపిస్తుంది. 2026 నాటికి మావోయిస్టు పార్టీని దేశంలో అంతం చేయడమే మా లక్ష్యం అని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు ప్రకటిస్తే, మా ఆపరేషన్ కగార్ ను అడ్డుకుని తీరడమే మా పంతం అని మావోయిస్టులు ప్రకటిస్తున్నారు. మహరాష్ట్ర, చత్తీస్ ఘడ్, ఆంధ్ర – ఒరిస్సా బోర్డర్, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో అంటే మావోయిస్టుల ప్రభావ ప్రాంతాల్లో ఓ యుద్దమే జరుగుతుందని చెప్పాలి. నిత్యం తుపాకి చప్పుళ్లతో, మందు పాతర పేళ్లుళ్లతో అటవీ గ్రామాలు చిగురుటాకుల్లో వణికిపోతున్నాయి. పచ్చటి అడవిలో వెచ్చటి నెత్తురు వర్షం కురుస్తోంది. ఇంతటి భీతావాహ పరిస్థితులు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నెలకొంది. ఇదంతా ఎందుకంటే ఈ నెల 21వ తేదీ నుండి అక్టోబర్ 20వ తేదీ వరకు పార్టీ సంస్థాపక వార్షికోత్సవాలు జరుపుకోవాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీకి, పార్టీ శ్రేణులకు, మావోయిస్టు సానుభూతిపరులకు పిలుపునిచ్చింది. ఇరవై ఏళ్లలో మావోయిస్టు పార్టీ అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంది. దాడులు –ప్రతి దాడుల మధ్య నలిగిపోయింది. అత్యంత కఠినమైన పరిస్థితులను క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంది. సేఫ్ జోన్లు అనుకున్న చోట రక్తం ఏరులై పారింది. పట్టణ ప్రాంతాల్లో షెల్టర్ ఇచ్చే వారు, పార్టీకి ఫండింగ్ చేసే వారు కరువయ్యారు. కోవర్ట్ ఆపరేషన్లు ఎదుర్కొంది. కీలమైన ముఖ్య నాయకులను పార్టీ కోల్పోయింది. గడచిన 20 ఏళ్లలో 22 మంది కేంద్ర కమిటీ సభ్యులను ఎన్ కౌంటర్లలో కోల్పోయింది. అందులో 8 మంది కీలకమైన పొలిట్ బ్యూరో సభ్యులు ఉన్నారు. పోలీసు దాడుల్లో 5249 మంది మావోయిస్టులు చనిపోయారు. ఇందులో దాదాపు వేయి మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. ఈ ఏడాది జులై వరకు లెక్క తీస్తే పోలీస్ దాడుల్లో 171 మంది ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టుల లెక్క ప్రకారం 63 మంది సాధారణ పౌరులు, 44 మంది మావోయిస్టులు ఉన్నారు. ఇందులో 8 మంది గ్రామాణ మహిళలు ఉన్నారు. బీజాపూర్ జిల్లా ముద్దం గ్రామంలో 6 నెలల పసికందు ప్రాణాలు కోల్పోయింది. ఇంతటి మారణహోమం తమ పార్టీ ఎదుర్కొన్నట్లు మావోయిస్టులు తాజా విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు. తామేం తక్కువ తినలేదని నిర్బంధం, ఎన్ కౌంటర్లను ఎదుర్కొంటునే ఈ 20 ఏళ్లలో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ 4073 దాడులు నిర్వహించినట్లు మావోయిస్టులు చెబుతున్నారు. ఇందులో 3090 మంది చనిపోయారన్నది కామ్రేడ్స్ లెక్క. అయితే మూడేళ్లుగా శత్రువు నిర్బంధ పరిస్థితుల్లో, పోలీస్ దాడుల్లో పార్టీ నష్టపోకుండా ఉండేందుకు డిఫెన్స్ వ్యూహంలో ఉన్నట్లు మావోయిస్టులు చెబుతున్నారు. అంటే అగ్రెసివ్ గా తాము ఎదురు దాడులు చేయకుండా వెనుకంజ వ్యూహంతో సాగుతుంటే కేంద్ర ప్రభుత్వమే రెచ్చగొట్టేలా ఆపరేషన్ కగార్ పేరుతో తమపై దాడులకు దిగుతోందన్నది మావోయిస్టు పార్టీ ఆరోపణ. ఈ మూడున్నరేళ్లలో 439 మంది పార్టీ సభ్యులను కోల్పోయామని, 215 ఆయుధాలు కోల్పోయినట్లు, కొంత మేర ఉద్యమం కూడా బలహీనపడిందని మావోయిస్ట్ పార్టీ తన అంతర్గత సమీక్షలో తెల్చి చెప్పింది. అయితే కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్ ను మాత్రం తిప్పికొట్టడం ఖాయమని ఇదే తమ లక్ష్యమని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. 2026 కల్లా దేశంలో మావోయిస్టు పార్టీని లేకుండా చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మోదీ ప్రభుత్వం కొలువు తీరిన వెంటనే.. తమ వందరోజుల పాలనలో మావోయిస్టులను అంతం చేయడం తమ ప్రాధాన్యత అంశంగా కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2014 నాటికి దేశంలో మావోయిస్టు పార్టీ దాదాపు 200 జిల్లాల్లో తమ ప్రభావం చూపుతుంటే, దాన్ని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ప్రభావం తగ్గించామని చెబుతోంది. 2024 సెప్టెంబర్ నాటికి 43 జిల్లాలకు మాత్రమే మావోయిస్టుల ప్రభావాన్ని పరిమితం చేశామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ ఏడాది జనవరి నాటికి 700 మంది మావోయిస్టులను లొంగిపోయేలా చేయడమే, లేక ఎన్ కౌంటర్లలో చంపడమో జరిగిందని కేంద్ర ప్రభుత్వం లెక్కలు చెబుతున్నాయి. 2026 నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని ఇదే తమ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ చెబుతోంది. ఇది కేంద్ర ప్రభుత్వ వర్సెస్ మావోయిస్టు పార్టీ అన్నట్లుగా మారింది. అయితే ప్రస్తుత ప్రజాస్వామిక దేశంలో భౌతికంగా రూపు మాపడం వల్ల ఒక సిద్ధాంతం చచ్చిపోతుందను కుంటే అది భ్రమే. ఇప్పటి వరకు ప్రపంచ చరిత్ర చూసినా, మన దేశంలో నక్సలిజం పురుడు పోసుకున్నప్పటి నుండి ఇప్పటి వరకు జరిగిన నక్సల్ చరిత్ర చూసినా అతి తప్పే అని అర్థం అవుతుంది. అదే రీతిలో ఓ ప్రజా స్వామ్య దేశంగా పరిణితి చెందుతూ అడుగులు వేస్తోన్న మన భారత దేశంలో తుపాకితనో, తూటాలతోనో రాజ్యం సాధిస్తామని అనుకోవడం కూడా ఓ భ్రమే. ప్రజా బలంతో రాజ్యాల నిలబడతాయే తప్ప తుపాకి తూటాలతో రాజ్యాన్ని సాధించుకోలేమన్నది కూడా మన కళ్ల ముందు ఉన్న చరిత్రనే. ఈ చరిత్ర చెబుతోన్న పాఠాలు అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు మావోయిస్టు పార్టీ గుర్తిస్తే మన దేశం ప్రజాస్వామ్య పరిణితి గల దేశంగా మరింత ముందుకు సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# గ్రామ అభివృద్ధిలో ప్రత్యేక అధికారుల బాధ్యతలు ముఖ్యం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 18 (తీన్మార్ న్యూస్): గ్రామాల అభివృద్ధిలో గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారుల విధులు, బాధ్యతలు చాలా ముఖ్యమైనవని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాటారం మండల పరిషత్ కార్యాలయంలో కాటారం డివిజన్ గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం ముగిసినందున పారిశుధ్య కార్యక్రమాలు చాలా ముఖ్యమని మండల ప్రత్యేక అధికారులు గ్రామాల్లో వారంలో రెండు రోజులు తనిఖీలు చేస్తూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బంది విధులను పర్యవేక్షణ చేయటం చాలా ముఖ్యమని తెలిపారు. ప్రత్యేక అధికారులు పర్యటనలో గుర్తించిన అంశాలను పరిశీలించడానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, సబ్ సెంటర్స్, రెసిడెన్సియల్ హాస్టల్స్, గ్రామపంచాయతీ భవనాలు, ప్లాంటేషన్ కంపోస్ట్ షెడ్లు, వైకుంఠధామాలు తనిఖీ చేయాలని, తనిఖీ ఫోటోలను గ్రూపులో పోస్ట్ చేయాలని తెలిపారు. మన గ్రామపంచాయతీ క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండాలని అదే మన గోల్ అని తెలిపారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయటం వల్ల గ్రామాలు స్వచ్ఛతను సంతరించుకుని వ్యాధులు దరిచేరని సమాజం ఏర్పడుతుందని అన్నారు. గ్రామాలు స్వచ్ఛతకు జరుగుతున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. రహదారులు వెంబటి వ్యర్థాలు తొలగించాలని అక్కడ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించే చర్యలు చేపట్టాలని తెలిపారు.



గ్రామపంచాయతీ అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని అపవాదులు రావొద్దని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమంలో మీరు భాగస్వాములుగా ఉన్నారని, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీ అధికారాలను, విధులను వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఆరుబయట వ్యర్థాలు కాల్చితే చర్యలు తీసుకోవాలని, కాల్చడం వల్ల శ్వాసకోశ వ్యాధులు వస్తాయని తద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. వ్యర్థాలు కాల్చితే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రకారం 25 వేల వరకు జరిమానా విధించడానికి అవకాశం ఉందని తెలిపారు. భగీరథ నీటి సరఫరా పర్యవేక్షణ చేయాలన్నారు. మంచినీటి సమస్య ఏర్పడితే తన దృష్టి తీసుకురావాలని సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. వేసవిలో చేపట్టిన చర్యల వల్ల గ్రామాల్లో సమస్యలు రాకుండా చేశామని, భవిష్యత్తులో ఏదైనా సమస్య వస్తే తక్షణం పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ యొక్క సమావేశం ముఖ్య విధి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆయన పేర్కొన్నారు. విధులు అధికారాలు గురించి చట్టం గురించి తెలుసు కోవాలని గ్రామ పంచాయితీలో పర్యటించడం వలన గ్రామాలు స్వచ్ఛతను సంతరించు కుంటాయని పేర్కొన్నారు. ప్రతి వారంలో రెండు లేదా మూడుసార్లు తప్పనిసరిగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో విదులు అధికారాలపై సమగ్రమైన, స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఆయన పేర్కొన్నారు. వ్యాపార, మాంసాహార వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం తగ్గించే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. అమ్మపేరున మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలన్నారు. వనరుల ద్వారా ఆదాయం సమకూరే లా ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతి కార్మికులను శాలువాతో సత్కరించి సేవలను అభినందించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేపించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, మండల ప్రత్యేక అధికారి సంజీవరావు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు ప్రజలతో మమేకమైన పని చేయాలి

- ♦ ఫ్లడ్ నివారణకు పక్కా ప్రణాళికతో అధికారుల కమిటీ వేయాలి
- ♦ రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)

మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 18 (తీన్మార్ న్యూస్): బుధవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లాలో కురిసిన భారీ వర్షాలు,వరదల కారణంగా తీసుకున్న చర్యలు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, అన్ని విభాగాల జిల్లా అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచి నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ, సీతక్క పాల్గొన్న మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు, వరదల కారణంగా నష్ట పోయినా బాధితులకు కోసం అధికారులు అంకితభవంతో పనిచేసి వారికి మనోధర్యం కల్పించాలని కోరారు. దెబ్బతిన్న (15) ఆర్అండ్ బీ రహదారులు, నేషనల్ హైవే లు వెంటనే మరమత్తులు చేపట్టి అవసరం ఉన్న చోట వంతెనలు నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధం చేయలన్నారు, ఇరిగేషన్ జిల్లాలో (136) చెరువులు నష్టం జరిగినవి కొన్ని చెరువులు మరమత్తులు చేశారని, మిగిలిన చెరువుల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో (2196) విద్యుత్ పోల్లు నష్టం జరిగాయనీ, 1400, స్తంభాలు నూతంగా ఏర్పాటు చేయడం జరిగిందని, నూతన ట్రాన్స్ఫార్మర్స్, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం పంటల నష్టం వివరాలు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించి నివేదిక సిద్ధం



చేయాలన్నారు. వరదల కారణంగా దెబ్బతిన్న గ్రామాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇప్పటి వరకూ 1160, వైద్య శిబిరాలు నిర్వహించి, 19, వేల 724, ల ఫీవర్ సర్వే నిర్వహించి గుర్తించామని, వెంటనే వారికి కావలసిన మందులు పంపిణీ చేసి,వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. ముందస్తు కమిటీలు వేసుకొని వరదలు నుండి ఎలా బయటపడాలో (ఫ్లడ్ మ్యాప్ బుక్) సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ అధికారులను కోరారు. తద్వారా వరదల ప్రభావం నుండి ఆస్తి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. సీతారాం నాయక్ తండ, అవిలాలలో సూచించిన కాలనీలను తరలించేందుకు అధికారులు సర్వేలు నిర్వహించాలన్నారు. చెరువులు, కుంటలు, వాగులు, ప్రాంతం అయితే మనకే ప్రమాదమని వాటిని కాపాడుకునేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు,వరదల వల్ల నష్టపోయిన బాధితులకు వివిధ స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ సంఘాలు, జిల్లా యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం, చేసిన సేవలు మరువలేనివని అభినందించారు. కొత్తగూడా, గంగారం మండలాల్లో ప్రజల సౌకర్యార్థం సెల్ ఫోన్ టవర్లు నిర్మించడం జరిగిందని అందుకు సంబంధించిన సిగ్నల్స్ గురించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న ఏడు గ్రామాలలో విద్యుత్, తాగునీరు, రోడ్ల మరమ్మత్తులు, సానిటేషన్, వైద్య శిబిరాలు, నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని బ్యాంకారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రైతులకు ఇబ్బందులు లేకుండా రుణాలను అందించాలని సూచించారు. వరద బాధితులకు చివరి వరకు ప్రతి ఒక్కరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహాయం చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో మరొక్కసారి సర్వే నిర్వహించి పూర్తి వివరాలను నివేదికను సిద్ధం చేయాలన్నారు. మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు వారి వారి శాఖల వారీగా నష్టపోయిన ఫోటోల వివరాలను మంత్రి చూపించారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

■ కార్యక్రమంలో పాల్గొన్న కొణతం చిన్న వెంకటరెడ్డి

నేరేడుచర్ల, సెప్టెంబర్ 18 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల మండల పరిధిలోని పెంచికల్ దిన్నె గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ యల్లబోయిన వెంకటి 60,000 రూపాయలు, సోమనబోయిన పెద్ద నరసయ్య 60,000, షేక్ షమీ 15 ,000 రూపాయలు మరియు గాడుదుల శోభ 18,000 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కులను బాధితులకు నేరేడుచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొణతం చిన్న వెంకటరెడ్డి చేతుల మీదగా నేరేడుచర్ల పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పెంచికల్ దిన్నె మాజీ ఎంపీటీసీ వీరమాచనేని కృష్ణయ్య, మండల నాయకులు వల్లంచట్ల కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వూట్కూరి భార్గవ్ సైదులు, పెంచికల్ దిన్నె కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు



పెరుగు నాగరాజు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సిద్ధపంగ ఆర్కె మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండెం హరిబాబు, సిరికొండ రామకృష్ణ, కోడి రెక్క పవన్, నాయని సైదులు, యమ గాని నాగయ్య, యల్లబోయిన మధు, సిద్ధపంగ సైదులు, మచ్చ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సైన్స్ ఫెయిర్ సదస్సుకు ఎంపికైన నిఖిల్

ఆత్మకూరు, సెప్టెంబర్ 18 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం తిప్పడంపల్లి గ్రామానికి చెందిన నిఖిల్ కుమార్ జాతీయ సైన్స్ ఫెయిర్ సదస్సుకు ఎంపికయ్యారు. దీర్ఘకాలిక గాయాలకు సంబంధించి స్మార్ట్ బ్యాండేజ్ అంశంపై న్యూఢిల్లీలో ఈనెల 17 18 19 తేదీలలో స్మార్ట్ బ్యాండేజ్ (గైడ్ టీచర్ అరవింద్ పర్యవేక్షణలో) గురించి వివరించడం జరుగుతుంది. కావున ఒక మారుమూల గ్రామం నుండి జాతీయ స్థాయిలో పాల్గొనడం మా ప్రాంతానికి గర్వకారణంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్ గైడ్ టీచర్ అరవింద్ ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు విద్యార్థిని మరియు తల్లిదండ్రులను అభినందించారు




# 27న జాతీయ మెగా లోక్ అదాలత్

**– ఆత్మకూర్ ఎస్సై వి.నరేందర్**

ఆత్మకూర్, సెప్టెంబర్ 18 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో సెప్టెంబర్ 27వ తేదీన స్థానిక సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని ఆత్మకూర్ సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాక్సిడెంట్ కేసులు,కొట్టుకున్న కేసులు, చీటింగ్ కేసులు, చిట్ఫండ్ కేసులు, భూతాగాదాలకు సంబంధించిన కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చిన్నచిన్న దొంగతనం కేసులు, అక్రమ రవాణా (ఇసుక మట్టి కట్టెలు మద్యం ఇతర వస్తువులు) పేకాట కేసులు,లాక్ డౌన్ కేసులు, ట్రాఫిక్ రిలేటెడ్ కేసులు, ఫ్యామిలీ మ్యాటర్స్,గుట్కా కేసులు పలు రాజీ పడే కేసులు రాజి చేసుకుని కేసులను పూర్తిగా క్లోజ్ చేసుకునే అవకాశం ఉంటుంది. కావున ఇట్టి అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రాజీ మార్గమే ఉత్తమ మార్గమని స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ వి.నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.



# స్కూల్ బస్సులో పేలిన బ్యాటరీ.. తప్పిన పెను ప్రమాదం

హైదరాబాద్: స్కూల్ బస్సులో బ్యాటరీ పేలిన ఘటన కలకలం రేపింది. కామారెడ్డిలోని రామారెడ్డి రోడ్డులో ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులతో వెలుతుండగా ఆకస్మాత్తుగా బ్యాటరీ పేలింది. దీంతో బస్సులో ఒక్కసారిగా పొగలు వ్యాపించడంతో అందులోని విద్యార్థులు భయంతో కేకలు వేశారు. గమనించిన స్థానికులు అప్రమత్తమై విద్యార్థులను రక్షించారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది పిల్లలు ఉన్నారు. ఈ ఘటనలో పిల్లంతా క్షేమంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్కూల్ బస్సుల భద్రతా ప్రమాణాలపై రవాణా శాఖ అధికారులు తరుచూ తనిఖీలు నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# కారడవిలో 'పొదెం' పర్యటన

**- ధ్వంసమైన అటవీ వృక్షాల పరిశీలన**
**- అటవీ అభివృద్ధికి ప్రణాళికలు**
**అటవీ చైర్మన్ కు అధికారులు అపూర్వ స్వాగతం**





ములుగు జిల్లా, సెప్టెంబర్ 18 (తీన్మార్ న్యూస్): అది కీకరారణ్యం. దట్టమైన దండకారణ్యం.అయితేనేం కాలినడకన వెళ్లాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా అరణ్యంలో అడుగు పెట్టారు. ఇటీవల ప్రకృతి వ్యాపారీత్యాలకు ధ్వంసమైన అటవీ వృక్షాల పరిశీలనకు పూనుకున్నారు. కాకుల దూరని కారడవిలో కిలోమీటర్ల కొద్దీ కాలినడకన పయనించారు. ఇంతకీ ఎవరంటే వారే తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, ఈ ఘటన బుధవారం ఉదయం ములుగు జిల్లాలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యంతో ములుగు జిల్లాలో భారీగా అటవీ సంపద దెబ్బతింది. దాదాపు 500 ఎకరాల్లో అటవీ వృక్షాలు ధ్వంసమయ్యాయి. ఈ విషయం తన దృష్టికి రావడంతో తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ పొదెం వీరయ్య బుధవారం ములుగు జిల్లా అటవీ ప్రాంత పరిశీలన పర్యటన పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఉదయమే ములుగు హెడ్ క్వార్టర్ కు ఆయన చేరుకున్నారు. అటవీ అభివృద్ధి కార్పొరేషన్ శాఖ అధికారులు ములుగు వద్ద చైర్మన్ 'పొదెం'కు ఘనస్వాగతం పలికారు. తరువాత తాడువాయి చేరుకున్న వారికి జిల్లా అదనపు కలెక్టర్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, జిల్లా అటవీ అధికారి, డివిజనల్ ఫారెస్ట్ అధికారులు, స్థానిక కాంగ్రెస్ శ్రేణులు, పొదెం అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆహ్వానించారు. అనంతరం 'పొదెం' కాలి బాటన అటవీ మార్గాన వెళ్లారు. ముందుగా వారికి అటవీ అధికారులు ఏర్పాటు చేసిన ఈ ప్రకృతి ప్రకోపానికి సంబందించిన ఫోటో ఎక్విబిషన్ డిఎఫ్ఓ వివరించారు. కిలోమీటర్ల కొద్ది నడిచి ప్రకృతి వైపరీత్యంతో ధ్వంసమైన వృక్షాలను పరిశీలించారు. వృక్షాల పెంపకం తీరును పరిశీలించారు. దట్టమైన అరణ్యమైనప్పటికీ పొదెం ఉత్సాహంగా నడిచి, అందరినీ ఉల్లాసపరిచారు. ఈ సందర్భంగా అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ అధికారులతో, స్థానిక ఫారెస్ట్ శాఖ అధికారులతో తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య సమావేశం అయ్యారు. అటవీ అభివృద్ధికి కావలసిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. నష్టం పై అంచనా వేసి నివేదికలు పంపించాలని తెలిపారు. అటవీ సంరక్షణ ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, వృక్షాలను మనం కాపాడితే అవి మనల్ని కాపాడతాయని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డా. ప్రభాకర్ గారు, డీఎఫ్ఓ డిఎఫ్ఓ రాహుల్ జాదవ్, అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ ములుగు గారు, ఎఫ్డిసి డిఎం మాధవి, ఎఫ్డిఓ ఏటూరునగరం తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాను పారదర్శకతకు చర్యలు



ములుగు జిల్లా, సెప్టెంబర్ 18 (తీన్మార్ న్యూస్): పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాడానికి అన్ని చర్యలు తీస్కుంటున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్లో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, అధికారులు అడిషనల్ కలెక్టర్ ఇంచార్జీ సంపత్ రావు తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోవు గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందిస్తామని అన్నారు. ఓటరు జాబితా తయారీకి రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 13న ముసయిదా ప్రచురించడం జరిగింది అని అన్నారు. జాబితాపై సెప్టెంబర్ 13 నుంచి 21వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని అన్నారు. 19 తేదీన మండల స్థాయిలో ఎంపీడీఓల ఆధ్వర్యంలో రాజకీయ రాజకీయ పార్టీల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తారని, సెప్టెంబర్ 28న వార్డుల వారీగా తుది జాబితా ప్రచురించడం జరుగుతుంది అని అన్నారు. కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రం, వార్డులో ఉండే విధంగా చేపట్టిన (ఓటరు మెర్జింగ్) ప్రక్రియను తో పాటు మ్యాపింగ్ ప్రక్రియ ను నూరు శాతం పూర్తి చేయాలి అని అధికారులను ఆదేశించారు. ఓటరు జాభితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు, ఓటరు జాబితా తయారులో అబ్యంతరాలు, పిర్యాదులను సత్వరమే పరిస్కారం చూపాలి అని అన్నారు. జిల్లాలో 9 మండలాల పరిధిలో 174 గ్రామ పంచాయతిల పరిధిలో 1556 వార్డులున్నట్లు తెలిపారు. ఏమాత్రం అజాగ్రత్తకు తావివ్వకుండా, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో డి పి ఓ దేవ్ రాజ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గోన్నారు.

# మెడికవర్ హాస్పిటల్ పై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ ధర్నా



హనుమకొండ, సెప్టెంబర్ 18 (తీన్మార్ న్యూస్): వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతికి కారణమైన మెడికవర్ హస్పటల్ యజమాన్యం పై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి తిరుపతి మాట్లాడారు. వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన సుశీల అనే మహిళ గత సోమవారం కాలికి ఇన్ఫెక్షన్ అయిందని హాస్పటల్లో వైద్యం కోసం వస్తే పరీక్షలు నిర్వహించిన వైద్యులు, కిడ్నీలో రాళ్లు ఉన్నాయని వాటిని తొలగించడం కోసం ఆపరేషన్ చేయాలని అందుకోసం ఫీజులో రాయితీ కల్పిస్తామని, పేషెంట్ తరపున బంధువులకి మాటలు చెప్పి, రెండు లక్షల పదివేల రూపాయలు కట్టించుకుని, రెండు ఆపరేషన్లు చేసి అందులో ఒక ఆపరేషన్ విఫలం అవడంతో మహిళా మరణించిందని, చనిపోయిన పేషెంట్ కు వైద్యం నిర్వహిస్తూ కనీసం బంధువులను కూడా చూడనీయకుండా, మోసం చేసిన యజమాన్యమే మహిళ మృతికి కారణమని ఆరోపించారు, దానికి హాస్పటల్ యజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వైద్యం పేరుతో లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు హాస్పటల్, యజమాన్యాలకు ప్రజల ప్రాణాలు అంటే లెక్క లేకుండా పోయిందని, బతకాలని ఆశతో హాస్పిటల్కు వస్తే శవాలుగా ఇంటికి పంపిస్తున్నారని అన్నారు, ప్రైవేటు హాస్పటల్లో జరుగుతున్న మరణాలపై జిల్లా వైద్య అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికీ అనేక హాస్పటల్లో మరణాలు జరుగుతున్న ఒక హస్పటల్ కెళ్ళి సందర్శించి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రైవేటు హాస్పటల్లో పై చర్యలు తీసుకోవాలని తిరుపతి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ వరంగల్ జిల్లా కార్యదర్శి డి.సాంబమూర్తి, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి ఓ. చిరంజీవి, అనీల్,మహేష్, కుమార్ ,రాజేష్, అరుణ్ పాల్గొన్నారు

# ఉద్యమకారునికి ఘన నివాళి అర్పించిన మాజీ జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి



ఏటూరునాగారం, సెప్టెంబర్ 18 (తీన్మార్ న్యూస్): ఉదయం ఏటూరునాగారం మండలం శివాపూర్ -గోగుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ సర్పంచ్ యాలం రాంబాబు బుధవారం ఉదయం మృతి చెందగా హుటాహుటిన ఏటూరు నాగారం చేరుకున్న బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి వారి స్వగృహనికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూ తెలియజేశారు. వారి మరణం పార్టీకి తీరని లోటు అని భావోద్వేగానికి గురై వారి కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. నివాళులర్పించిన వారిలో ఏటూరునాగారం మండల పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, ఉద్యమకారుడు,జిల్లా సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, జిల్లా నాయకులు జగదీష్ , పిఏసిఎస్ డైరెక్టర్ మాది రామయ్య, కుమ్మరి చంద్రబాబు, కాల రామకృష్ణ, గోస్కుల రాంబాబు, ఏనుగు మహేష్, సుంక శ్రీనివాస్, పెంచికలా లక్ష్మీనారాయణ, ఏనుగుల రమేష్, వంక దేవేందర్, మెట్టకంటి సమ్మిరెడ్డి, ఏనుగుల ఐలయ్య, బొక్క పుష్ప, బుడుగుంట్ల భీమయ్య, ఎట్టి ప్రకాష్,మాదర్, అశోక్, ఈసం సారయ్య, రావుల జగన్, మోకాళ్ళ రంజిత్, బి రెడ్డి నరసింహారెడ్డి, ఏనాల మల్లారెడ్డి, వాసం అరుణ్, ఈసం రమేష్, ఏటూరునాగారం మండల బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాలుగోన్నారు.

# ఎమ్మెల్యే గైక్వాడ్ పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

**- ఇద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలి**
**- మదనాపురం కొత్తకోట కాంగ్రెస్ పార్టీ నాయకులు**



దేవరకద్ర, సెప్టెంబర్ 18 (తీన్మార్ న్యూస్): ఏఐసీసీ నేత భారతదేశ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పై వివాదాస్పంద వ్యాఖ్యలు చేసిన మహారాష్ట్రకు చెందిన శివసేన పార్టీ ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ మరియు బిజెపి నేత తన్వీందర్ సింగ్ పై కఠినంగా చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా మదనాపురం, కొత్తకోట పోలీస్ స్టేషన్ లో బుధవారం మదనాపురం మండల అధ్యక్షుడు గజ్జెల నాగన్న, కొత్తకోట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేస్త్రి శ్రీనివాసులు, బీచు పల్లి యాదవ్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్రలోని విదర్భ జిల్లా బుల్దానా నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ ఇటీవల మహారాష్ట్రలో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ నాలుక కోస్తే రూ 11 లక్షలు బహుమతిగా ఇస్తానని,అదేవిధంగా బిజెపి నేత తన్వీవిందర్ సింగ్ రాహుల్ గాంధీ బయటకు వస్తే చంపేస్తానని బహిరంగంగా మాట్లాడినందున ఈ ఇద్దరి అనుచిత వ్యాఖ్యలు చేసినందున వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకొని అధికార కూటమి సభ్యులు హద్దులు దాటి అత్యంత అభ్యంతరకర మాటలతో అనుచిత వ్యాఖ్యల చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని కోరారు. రాహుల్ గాంధీ పై దాడి చేస్తామని బిజెపి నేతలు, శివసేన నేతలు హింసను ప్రోత్సహించేలా బహిరంగంగా బెదిరిస్తున్న ఇట్టి విషయంపై ప్రధాని మంత్రి మరియు కేంద్ర హోం శాఖ మంత్రి స్పందించకపోవడం దేశ ఔన్నతం దిగజార్చే చర్య అన్ని విమర్శలు చేశారు. చట్టసభలలో ఉండే సభ్యులు ఎలా ప్రవర్తించాలో ఆ నేతలకు సూచించండి అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎన్ జే బోయోజ్, పి.కృష్ణారెడ్డి, మదనాపురం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డె కృష్ణ,మండల నాయకులు సాయి బాబా, దంతనూరు గ్రామ అధ్యక్షులు వెంకటన్న, కొత్తకోట మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు శేఖర్ రెడ్డి,సాయి రెడ్డి, మాసన్న, సురేందర్ రెడ్డి, ప్రచార కార్యదర్శి పి మోహన్ రెడ్డి, బాలకొండయ్య యాదవ్, బీసీ సెల్ శ్రీనివాసులు, యూత్ కాంగ్రెస్ నాయకులు దిలీప్ రెడ్డి, నవీన్ రెడ్డి, శ్రీకాంత్, వల్లమాన్ శ్యామ్, ఎండి తయాబ్, లక్ష్మయ్య యాదవ్, బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సర్కారు చేసిన అప్పులు ఇప్పుడు భారంగా మారాయి

**- వడ్డీని పూర్తిగా లేదా పాక్షికంగా తగ్గించండి**
**- కేంద్ర ప్రభుత్వ రంగ ద్రవ్య సంస్థలను ఒప్పించండి : కేంద్ర ప్రభుత్వానికి ఉత్తమ్ విజ్ఞప్తి**




హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి తీవ్ర ఆర్థికభారంగా మారాయని రాష్ట్ర భారీనీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అప్పుపై విధించిన వడ్డీని పూర్తిగా లేదా పాక్షికంగా తగ్గించేలా కేంద్రప్రభుత్వరంగ ద్రవ్య సంస్థలను ఒప్పించేలా చొరవ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వీలైతే మొత్తంగా క్లియర్ చేయాలనీ లేదా పాక్షికంగానైనా మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం న్యూఢిల్లీలోని భారత మండపంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 'ఇంటర్నేషనల్ ఎనిమిదోవ వాటర్ వీక్ సదస్సు-2024'కు ఆయన హాజరయ్యారు. నాలుగు రోజులపాటు జరగనున్న సదస్సును భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. సదస్సులో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ నీటి రంగానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నదని వివరించారు. ప్రతియేటా సుమారు ఆరు లక్షల ఎకరాల మేర కొత్త ఆయకట్టును సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో రూ. 29 వేల కోట్లను ఈ రంగానికి కేటాయించినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కృషికి తోడుగా కేంద్రం నుంచి తగిన సహాయ, సహకారాలు అందించాలని కోరారు. దేశంలో ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను పెంపొందించేందుకు లక్షల కోట్లు కేటాయిస్తామంటూ కేంద్రం పార్లమెంటులో ప్రకటించారో, అదేవిధంగా నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం కోసం అదే స్థాయిలో కేటాయించాలని మంత్రి కోరారు. ఈ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి నిధుల రూపంలో సాయం అందడంతోపాటు వివిధ రకాల అనుమతులను కూడా త్వరిగతిన ఇచ్చేలా చొరవ తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పలు సాగునీటి ప్రాజెక్టులకు ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు తరఫున సాఫ్ట్ లోన్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమ్మక్క-సారలమ్మ ఇరిగేషన్ ప్రాజెక్టులో కొంత ముంపు భాగం చత్తీస్‌గడ్ రాష్ట్ర పరిధిలో ఉన్నదనీ, దీన్ని పూర్తి చేసేందుకు ఆ రాష్ట్రం నుంచి ఎన్ఓవో రావాల్సి ఉన్నదనీ, ఆ ప్రక్రియను వేగవంతం చేయాల్సిందిగా ఆ రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి కేదార్ కశ్యప్‌తో చర్చించినట్టు పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. సదస్సులో 40 దేశాల నుంచి ప్రతినిధులతోపాటు మన దేశంలోని 20 రాష్ట్రాలకు చెందిన ఇరిగేషన్ మంత్రులు, ఎన్జీవో సంస్థల ప్రతినిధులు, నిపుణులు, పాలసీ మేకర్స్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విలీనం జరిగినప్పుడు బీజేపీ పుట్టనే లేదు

**- ఆ పార్టీ దిగజారుడు రాజకీయం చేస్తుంది**
**- నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడారు**
**- గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్**



హైదరాబాద్: దేశంలో తెలంగాణ విలీనం జరిగినప్పుడు బీజేపీ పుట్టనే లేదనీ, అయినా ఆ పార్టీ విమోచన అంటూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నదని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. దేశాన్ని ముక్కలు చేయాలనే కుట్రలో భాగంగా ఆ పార్టీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ విలీనం ప్రక్రియలో ఎలాంటి పాత్రలేని కమలనాథులు కాంగ్రెస్ పార్టీకి నీతులు చెప్పాల్సిన అవసరం లేదని హెచ్చరించారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, తొలి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయిపటేల్ ఎంతో విజన్ ఉన్న గొప్ప నేతలు అని కొనియాడారు. దేశం కోసం వారు చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోయాయని గుర్తు చేశారు. బీజేపీకి, ఆ చరిత్రకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నిజాం సర్కారుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడారనీ, ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని తెలిపారు. ఆ సమయంలో జనసంఘ్, బీజేపీ అడ్రస్‌లేవని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ విలీన దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా గాంధీ, పటేల్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహేష్‌కుమార్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17, 1948 వరకు మన సంస్థానానికి స్వతంత్రం రాలేదన్నారు. నెహ్రూ, పటేల్ ఎంతో దూరదృష్టితో వ్యవహరించి ఈ ప్రాంతాన్ని దేశంలో విలీనం చేయించారని కొనయాడారు. ఆ సమయంలో బీజేపీ అనుబంధ సంఘాలు బ్రిటీష్ ప్రభుత్వానికి వంత పాడాయని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి, పటేల్‌కు ఎలాంటి సంబంధం లేకపోయినా ఆయన్ను తమ నాయకుడిగా కమలనాథులు ప్రచారం చేసుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ విలీనం గురించి మాట్లాడే హక్కు ఆ పార్టీకి లేదని స్పష్టం చేశారు. పదేండ్లుగా రాష్ట్రాభివృద్ధిని కేసీఆర్ తుంగలో తొక్కారని విమర్శించారు. రాజీవ్ గాంధీ విగ్రహం పెడితే, ఆ పార్టీ నేతలు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు.
ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసింది రాజీవ్ గాంధీయేనన్నారు. రాజీవ్‌గాంధీ గురించి మాజీ మంత్రి కేటీఆర్ సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ తల్లి గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. సచివాలయ గర్భం(మధ్య భాగం)లో తెలంగాణ విగ్రహం పెడుతుంటే, బీఆర్ఎస్‌కు ఉన్న ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. బీజేపీ పెట్టే చిచ్చులో పడొద్దనీ, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొంది అభివృద్ధి పథంలో పయనిద్దామని పిలుపునిచ్చారు. ఎవరు ఎంత జనాభా ఉంటే వారికి అంత వాటా అని రాహుల్ గాంధీ చెప్పారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, ఫిషరీస్ చైర్మెన్ మెట్టుసాయికుమార్, కార్పొరేషన్ల చైర్మెన్లు, అధికార ప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ సేవాదల్ చైర్మెన్ జితేందర్ నేతృత్వంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు గౌరవ వందనం చేశారు.

# పశువులకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు

భిక్కనూర్: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో బుధవారం పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో పశు వైద్యాధికారి దేవేందర్ గ్రామంలోని పశువులకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత్ పశుదన్ యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకొని టీకాలు వేయడం జరిగిందని దాదాపు రెండు వేల గొర్రెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ టీకాలను మండలంలోని అన్ని గ్రామాలలో పశువులకు వేయడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన తంజీమ్ ఫోకస్, టిఎస్ సిఎస్

హైదరాబాద్ : మిలాద్ ఉల్ నబీ సందర్భంగా ఇవ్వడంలోని స్ఫూర్తిని పెంపొందించేందుకు విశేష ప్రయత్నంగా, హైదరాబాద్లోని తంజీమ్ ఫోకస్, తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ (టిఎస్ సిఎస్) ఆధ్వర్యంలో మౌలానా డాక్టర్ అహ్సన్ అల్ హమూమీ సాహబ్ మార్గదర్శకత్వంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.
అఫ్జల్గంజ్ లోని చారిత్రాత్మకమైన ఆసిఫియా స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, జరిగిన ఈ శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది. దాదాపు 720 మంది వాలంటీర్లు రక్తదానం చేశారు. డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ నేతృత్వంలోని %ఖుజా%. తంజీమ్ ఫోకస్ బృందాలు కార్యక్రమం విజయవంతం కావడానికి అవిశ్రాంతంగా పనిచేశారు. ఈ కార్యక్రమ ప్రాముఖ్యత గురించి మౌలానా డాక్టర్ అహ్సన్ అల్ హమూమీ సాహబ్ మాట్లాడుతూ, 'మిలాద్ ఉల్ నబీ మానవాళికి కరుణ మరియు సేవ యొక్క విలువలను బోధిస్తుంది. రక్తదానం చేయడానికి కలిసి రావడం ద్వారా, మేము ఆ విలువలను ప్రతిబింబించాము. నిజమైన మార్పును తీసుకువస్తున్నాము. సమాజం నుండి వచ్చిన స్పందన పట్ల సంతోషంగా వున్నాము' అని అన్నారు. %ఖుజా% ప్రెసిడెంట్ చంద్రకాంత్ అగర్వాల్ మాట్లాడుతూ, 'ఈ రక్తదాన శిబిరం తలసేమియా మరియు సికిల్ సెల్ వ్యాధితో



బాధపడుతున్న వారికి సహాయం చేయడంలో సంఘం యొక్క అంకితభావానికి నిదర్శనం. రక్తమార్పిడిపై ఆధారపడే రోగుల జీవితాలను రక్షించడంలో మరియు జీవన నాణ్యతను మెరుగుపరచడంలో ఈ దాతలు అందించిన తోడ్పాటు ప్రశంసనీయం' అని అన్నారు. మిలాద్ ఉల్ నబీ వేడుకలలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించబడింది. తంజీమ్ ఫోకస్ మరియు %ఖుజా% రెండూ సమాజానికి సేవ చేయడం కొనసాగించడానికి భవిష్యత్తులో ఇటువంటి ప్రభావవంతమైన కార్యక్రమాలను నిర్వహించడానికి కట్టుబడి ఉంటాయి.

# రాజకీయాల కోసం సెప్టెంబర్ 17కు వక్రీకరణ

### – పాలనే లేదంటే ప్రజాపాలన దినోత్సవమా? : కేటీఆర్

హైదరాబాద్: చరిత్ర తెలియని కొంత మంది తమ రాజకీయాల కోసం సెప్టెంబర్ 17ను వక్రీకరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సంద ర్భంగా మంగళవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్లో ఆయన జాతీయ జెండా ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పాలనే లేదంటే ప్రజాపాలన దినోత్సవమంటూ జరుపుతున్నారని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ను దూషిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న రేవంత్ రెడ్డికి చేతనైతే ఇచ్చిన హామీలను అమలు చేయాలని సవాల్ విసిరారు. రైతుబంధు, వద్ధులకు రూ.4 వేల ఫించన్, 2 లక్షల ఉద్యోగాల కల్పన తదితర హామీల అమలు మరిచారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుల బండ్లకు పెట్రోల్కు బిల్లులు కట్టడం లేదనీ, పాఠశాలల్లో చాక్పీస్లు లేని పరిస్థితి, మాజీ సర్పంచ్లకు బిల్లుల కోసం బాధలతో రాష్ట్రంలో పరిస్థితులు దిగజారాయని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహం పెడదామన్న చోట రాహుల్ గాంధీ తండ్రి విగ్రహం పెట్టారనీ, ఢిల్లీ మెప్పు కోసం రేవంత్ రెడ్డి ఇలా చేశారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ రెడ్డికి ఏమి తెలియదనీ, ఆ విషయం కూడా ముఖ్యమంత్రికి తెలియదని ఎద్దేవా చేశారు. చార్లెస్ బాబ్బెజ్ కనిపెట్టిన కంప్యూటర్ను రాజీవ్ గాంధీ కనిపెట్టారని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఆ కంప్యూటర్ను 1955లో భారత దేశానికి టాటా గ్రూప్ పరిచయం చేసిందే తప్ప



రాజీవ్గాంధీ కాదని స్పష్టం చేశారు. పారిశుధ్యాన్ని నిర్లక్ష్యం చేయడంతో చికెన్ గున్యాలు, విష జ్వరాలు,, డెంగ్యూలతో ప్రజలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆరోగ్య అత్యవసర పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. గురుకులాల్లో పిల్లల మీద అఘాయిత్యాలు జరుగుతున్నాయనీ, గురుకుల టీచర్లను తొలగిస్తున్నారని విమర్శించారు. డైవర్షన్ రాజకీయాలు ఆపి పాలనపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు వెంట పడతామని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక సకల మర్యాదలతో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీభవన్కు తరలిస్తా మని తెలిపారు. ఇష్టముంటే రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ విగ్రహాన్ని జూబ్లీహిల్స్లోని తన నివాసంలో పెట్టుకోవాలని సూచించారు. తెలంగాణ తల్లికి పాలాభిషేకం చయకుండా అడ్డుకున్న తమ విద్యార్థి నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మేడారం- తాడ్వాయి అడవుల్లో చెట్లు నేల రాలి, కూలిపోవడం బాధాకరం..

### – రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య
### – మేడారం అడవుల్లో సుడిగాలికి నేల కూలిన వృక్షాలను పరిశీలించిన పొదెం వీరయ్య
### – మేడారం వనదేవతలను దర్శించుకున్న పొదెం వీరయ్య

తాడ్వాయి : తుఫాను దాటికి గత నెల 31 వ తారీకు న లక్షల చెట్లు, భారీ వృక్షాలు నేల రాలి, కూలిపోవడం చాలా బాధాకరమని, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. బుధవారం మేడారం అటవీ ప్రాంతాల్లో సుడిగాలికి టోర్నోడో తరహాలో నేల కూలిన లక్షల భారీ వృక్షాలను, కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు బొల్లు రమేష్ కుమార్ ముదిరాజ్, మిగతా కాంగ్రెస్ శ్రేణులు, జిల్లా అటవీ శాఖ అధికారులతో కలిసి సందర్శించి, పరిశీలించారు. నష్టపోయిన అటవీ సంపద వివరాలను అడిగి తెలుసుకున్నారు. విపత్తు జరిగిన ప్రాంతాన్ని డ్రోన్ విజువల్స్ లను చూపిస్తూ జరిగిన నష్టాన్ని అధికారులు అడవి అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరయ్య కు వివరించారు. మొదట పొదెం వీరయ్య తాడ్వాయి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నాయకుడు బొల్లు రమేష్ కుమార్



ముదిరాజ్ ఇంటి వద్దకు చేరుకున్నారు. ములుగు జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వీరయ్యకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెబోయిన సృజన అనారోగ్యంతో ఉండగా ఆమె ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య మాట్లాడుతూ.. నష్టపోయిన అటవీ సంపద వివరాలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అధికారులు సమర్పించిన నివేదికల ఆధారంగా కార్యాచరణ చేపడతామన్నారు.

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

### – ప్రజాపాలన దినోత్సవం దేనికి సంకేతం?
### – మఖ్దూంభవన్లో సాయుధ రైతాంగ పోరాట వారోత్సవ వేడుకలు

హైదరాబాద్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరిస్తే సహించబోమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ పనిగట్టుకుని ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు పోరాటం చేశారంటూ ఆ చరిత్రను వక్రీకరిస్తున్నాయని విమర్శించారు. కమ్యూనిస్టుల నేతృత్వంలో హిందువులు, ముస్లింలు కలిసి బందూకులు పట్టి సాగించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వాస్తవ చరిత్ర చెరిగిపోదని చెప్పారు. ఆ పోరాట స్ఫూర్తి ఎప్పుడూ ఈ ప్రాంత ప్రజల గుండెల్లో తిరుగుబాటు చైతన్యాన్ని కలిగిస్తుందన్నారు. మనిషి ఉన్నంత కాలం అరుణ పతాకం రెపరెపలాడుతూనే ఉంటుందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 76వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్లో తెలంగాణ విలీన దినోత్సవ వేడుకులను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను కూనంనేని సాంబశివరావు, అరుణ పతాకాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా ఎగరేశారు. సాయుధ పోరాట అమరవీరులకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పేరు ఉచ్ఛరించడానికి పాలకులకు భయమని అన్నారు. విమోచన దినమంటూ కేంద్ర ప్రభుత్వం, సమైక్యతా దినమంటూ మాజీ సీఎం కేసీఆర్,



ప్రజాపాలన దినోత్సవమంటూ ముఖ్యమంత్రి రేవంత్ అంటున్నారని చెప్పారు. ప్రజాపాలన దినోత్సవం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. పోరాటానికి సంకేతమా లేదంటే తెలంగాణ విలీనా నికి సంకేతమా అని సీఎం రేవంత్రెడ్డిని అడిగారు. ప్రజా పాలన పేరుతో నాటి పోరాటం పేరే ఉనికిలో లేకుండా పోయే ప్రమాదముం దన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనం సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం,నిజాం రాజు మధ్య జరిగిన ఒప్పందంలో చట్టబద్దంగా విలీనం అని పొందపర్చారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వమైనా, రాష్ట్ర ప్రభుత్వమైనా చట్టబద్ధమైన తెలంగాణ విలీన దినోత్సవం పేరుతోనే ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు

### – బండారి రవికుమార్, సూడి కృష్ణారెడ్డి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

గోవిందరావుపేట : సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారి రవికుమార్ సూడి కృష్ణారెడ్డిలు అన్నారు. మంగళవారం మండలంలోని పస్రా గ్రామంలో సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయం లో కామ్యూనిస్ట్ స్థిత ప్రజ్ఞుడు సీతారం ఏచూరి యొక్క సంతాప సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు బండారి రవికుమార్, సూడి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ.. సీతారామ్ ఏచూరి మరణం కామ్యూనిస్ట్ పార్టీ కి తీరని లోటు అని అంతేగాక దేశ రాజకీయాలలో కూడా అతను ఒక పార్లమెంట్ సభ్యులు గా ఎంతో ప్రాధాన్యత గల ప్రజా ప్రతినిధి గా గుర్తింపు పొందారని అన్నారు. వారి కుటుంబ సభ్యులు కోరిక మేరకు తను ఒక ఐఏఎస్ అధికారి అయ్యుండే వారు కానీ వారు పోరాట మార్గాన్ని ఎంచుకున్నారని, దేశ అత్యవసర పరిస్థితి సందర్భంగా విధించిన



నిర్బంధం వలన తను పీహెచ్డీ పూర్తి చేసే అవకాశం కోల్పోయారని ఈ సందర్బంగా తెలియజేసారు. అన్ని పార్టీల నాయకుల చేత విలువగల పార్లమెంట్ సభ్యులుగా గుర్తింపు పొందరని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి, మండల కార్యదర్శి తీగల ఆగిరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీరెడ్డి సాంబాశివ, పొదిల్ల చిట్టిబాబు, కొప్పుల రఘుపతి, రత్నం రాజేందర్, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ దావూద్, గొంది రాజేష్, దుగ్గి చిరంజీవి జాగటి చిన్నా గ్రామ కార్యదర్శి కడారి నాగరాజు సభ్యులు కవిత పల్లపు రాజు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాల్లో విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

### మంత్రి సీతక్క
### ములుగు జిల్లాలో కంటైనర్ ప్రభుత్వ పాఠశాల ప్రారంభం

ములుగు (కన్నాయిగూడెం): దట్టమైన అడవీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, గిరిజన పిల్లలను విద్యావంతులుగా చేయడానికి కృషి చేస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ– శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బంగారుపల్లిలో రూ.13.50లక్షలతో ఏర్పాటు చేసిన కంటైనర్ ప్రభుత్వ పాఠశాలను మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఉపాధ్యా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల గ్రామాల్లో శాశ్వత ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయడానికి కేంద్ర అటవీశాఖ నిబంధనలు అడ్డు వస్తున్నాయన్నారు. దాంతో ఎలాగైనా గిరిజన బిడ్డలకు విద్యను అందించాలనే ఉద్దేశంతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో మరో రెండు మూడు



చోట్ల ఇలాంటి పాఠశాలలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యా వ్యవస్థ నాశనం అయిపోయిందని, వందలాది ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల మేరకు అన్ని సంక్షేమ పనులను అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ మహేష్ బాబా సాహెబ్ గీతే, ఏఎస్పీ శివం ఉపాద్యాయ, ఆర్డీఓ కె.సత్యపాల్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ అజరు కుమార్, డీఈఓ పాణిని, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎవ్వరొస్తారో.. చూస్తాం..!

### – డబుల్ ఇండ్ల బాధితులకు బీఆర్ఎస్ శ్రేణుల బెదిరింపులు..
### – ప్రభుత్వం మమ్మల్ని ఏమి చేయలేదంటూ హెచ్చరికలు?
### – మీరు ఎవరికి చెప్పుకున్నా మీకిండ్లు రావు
### – రెవెన్యూ అధికారుల చేతివాటంతో పేర్లు తొలగించారని ఆరోపణలు
### – వివాదంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపు
### – పాదర్శకంగా ఇళ్ళు కేటాయించాలని విజ్ఞప్తి

దుబ్బాక: బల్వంతాపూర్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో రెవెన్యూ అధికారులు 4 ఏళ్ళ క్రితం భూములు లేనోళ్లకు, భారీ వర్షాలకు కూలి ఇండ్లను కోల్పోయిన బాధితుల ఆర్థిక స్థితిగతుల్లేని వారి పేర్లు నమోదు చేసుకుని ఆ నివేదిక ప్రకారం ఇళ్లలో ఉండాలని మీరే అసలైన లబ్దిదారులంటూ చెప్యాల గడ్డకు చెందిన 10 మందిని గుర్తించి ఇళ్ళు కేటాయించారు. దీంతో వారంతా అక్కడే నివసిస్తూ కుటుంబ సభ్యులతో జీవనం సాగిస్తున్నారు. కూలీ నాలీ చేసుకుని బతికే పేద ప్రజలకు, ఆర్థికంగా వనరులు లేని సామాన్య ప్రజానీకానికి 4 ఏళ్ళ కిందట డబుల్ ఇళ్లను అధికారులు అందించారు. తాజాగా ఆ ఇండ్లపై కొందరు బీఆర్ఎస్ నాయకుల కండ్లు పడటంతో బడా నాయకుల అండతో నేడు అక్రమార్కులుగా మారుతూ ప్రజల్లో అపఖ్యాతి తేస్తున్నారని వాపోతున్నారు. గ్రామంలోని పలువురు పెద్దమనుషులు బీఆర్ఎస్ నాయకుల అనుచరులకు (ఆర్థికంగా



డబ్బు,ఆస్తులు, భూములు పరపతి ఉన్నోళ్లు ) రూ.2 లక్షలకే డబుల్ ఇళ్లను కేటాయించారాని అసలైన బాధితులు ఆరోపిస్తున్నారు.

**బీఆర్ఎస్ శ్రేణుల బెదిరింపులు..**

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద ప్రజలకు బీఆర్ఎస్ హయాంలో 20 మంది లబ్ధిదారులకు ఇళ్లను అధికారులు కేటాయించారు. గత నాలుగేళ్లుగా నివాసం ఉంటున్న వారిని తాజాగా అధికారులు మీరు అనర్హులని వెళ్లిపోవాలని హెచ్చరికలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదే అదునుగా భావించిన కొందరు బీఆర్ఎస్ శ్రేణులు గతంలో 10 మంది లబ్ధిదారులను బెదిరింపులకు గురి చేస్తున్నారని వినికిడి. ఎవ్వరొస్తారో చూస్తాం..

ప్రభుత్వం మమ్మల్ని ఏమి చేయలేదంటూ హెచ్చరికలు జారీ చేసి మీరు ఎవరికీ చెప్పుకున్నా మీకిండ్లు రావు అధికారులే మా చెప్పు చేతల్లో ఉన్నారని పరోక్షంగా వాఖ్యలు చేయడం తీవ్ర దుమారంలేపుతోంది.

# కొనలేం.. తినలేం

### – భారీగా పెరిగిన కూరగాయల ధరలు
### – వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడమే కారణమా.
### – దూర ప్రాంతాల నుంచి రవాణా సమస్య

మల్హర్ రావు: భారీ వర్షాలు, వరదలు కూరగాయల ధరలపై ప్రభావం చూపుతున్నాయి. వర్షాలకు ముందు ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం రెట్టింపు ధర పలుకుతున్నాయి. వేసవితో పోలిస్తే ప్రస్తుత తరుణంలో కూరగాయల ధరలు తక్కువ గా ఉంటాయి. కానీ వర్షాలు, వరదల కారణంగా స్థానికంగా సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరల పంటలు దెబ్బతిన్నాయి. దీనికి తోడు వరదల కార ణంగా ఇతర ప్రాంతాల నుంచి మండలానికి రవాణా ఇబ్బందికరంగా మారింది. వాహనదారులు మండలానికి రావడానికి ఇష్టపడడం లేదు. ఇలా రకరకాల కారణాలతో కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి. గత%శీ%లో రైతు బజార్ల రూ.40 ఉన్న చిక్కుడుకాయ ధర ప్రస్తుతం రూ.80కు చేరింది. ఇలా అన్ని రకాల కూరగాయలు ధరలు పెరగగా ఆకుకూరల పరిస్థితీ అలాగే ఉ




ంది. ఇక రైతుబజార్లతో పోలిస్తే ప్రైవేట్ మార్కెట్లలో ధరలు మరింత ఎక్కువగా పలుకు తుండడంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆకుకూరలు కూడా అంతే%శొ% కూరగాయలకు తోడు ఆకుకూరల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. బచ్చలికూర, పాల కూర, చుక్కకూర, తోటకూర, గోంగూర ఇలా ఏదైనా రూ.20కి మూడు కట్టలకు మించి ఇవ్వడం లేదు. ఓ మాదిరి కొత్తిమీర కట్ట రూ.50 ధర పలుకుతోంది. దీంతో ఆకుకూరలు కూడా కొనే పరిస్థితి లేక ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

# రాజీనామా అస్త్రం... ప్లస్సా... మైనస్సా...

న్యూఢిల్లీ: జైలు నుంచి విడుదలైన తర్వాత అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మరి కొద్ది రోజుల్లో ఢిల్లీ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో.. అనేక ఆయుధాలను ఆయన రెడీ చేసుకుంటున్నారు. తాను రెండు రోజుల్లో రాజీనామా చేస్తానని ఆదివారం ప్రకటించి దేశ రాజకీయాలలో కలకలం రేపారు.. ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకలు చోటుచేసుకున్నాయనే అభియోగాల నేపథ్యంలో ఆయన అరెస్టయ్యారు. అయితే తనపై పడ్డ అవినీతి మరకను తుడుచుకునేందుకు అరవింద్ కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. తన నిజాయితీని నిరూపించుకునేందుకు అరవింద్ ఈ ప్రకటన చేసినట్టు సమాచారం. ప్రజల తీర్పు తనకు అనుకూలంగా ఉండే వరకు ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకుంటారని అరవింద్ చెప్పడం చర్చనీయాంశంగా మారింది. రాజీనామా అస్త్రం ద్వారా ఆయన ఎలాంటి అడుగులు వెయ్యబోతారనేది ఉత్కంఠ గా మారింది. జైల్లో ఉన్నప్పుడు అరవింద్ కేజ్రీవాల్ పదవికి రాజీనామా చేయలేదు. జైలు నుంచి విడుదల తర్వాత ఆయన ఈ ప్రకటన చేయడం సంచలనంగా మారింది.రాజీనామా తర్వాత ఆయన ముందస్తు ఎన్నికలు వస్తాయని అంచనా వేస్తున్నారా? లేదా మరొకరిని తన స్థానంలో కూర్చోబెడతారా? అనే ప్రశ్నలకు స్పష్టత లేదు. ఒకవేళ ఎన్నికలు జరిగే సమయం వరకు ముఖ్యమంత్రి స్థానంలో ఎవరిని కూర్చోబెడతారనేది ఆసక్తికరంగా మారింది.. రాజీనామా ప్రకటనతో ముందస్తు ఎన్నికలకు అరవింద్ కేజ్రివాల్ సిద్ధపడ్డారా? అనే ప్రశ్న అందరిలోనూ తలెత్తింది. అయితే పదవీకాలం మిగిలి ఉండగానే ప్రభుత్వాన్ని రద్దు చేయడం వల్ల ఉపయోగముండదని అరవింద్ కేజ్రీవాల్ భావిస్తున్నట్టు తెలుస్తోంది.. అయితే రాజీనామా ప్రకటన చేసిన తర్వాత కొంత సమయానికే ఢిల్లీ స్పీకర్ రామ్ నివాస్ గోయల్ అరవింద్ కేజ్రీవాల్ ను కలవడం.. చాలాసేపు మాట్లాడటం చర్చకు దారి తీసింది. ఆ తర్వాత రామ్ నివాస్ విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాన్ని రద్దు చేసే ఆలోచన తమకు లేదని స్పష్టం చేశారు. పదవి కాలం ఉన్నంతవరకు తమ ప్రభుత్వం కొనసాగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత అరవింద్ కేజ్రీవాల్ పూర్తి సమయాన్ని ఎన్నికల ప్రచారం కేటాయిస్తారని వివరించారు. అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేసి.. తదుపరి ఎన్నికల్లో గెలిచేందుకే అడుగులు వేస్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. అయితే దీనిపై ఆప్ నేతలు ఇంతవరకూ స్పందించలేదు. " మద్యం కుంభకోణంలో అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణలు ఎదుర్కొన్నారు. జైలుకు వెళ్లి వచ్చారు. ఆయన పార్టీ పంజాబ్ రాష్ట్రంలో అధికారంలో ఉంది. హర్యానాలో అధికారాన్ని దక్కించుకోవాలని భావిస్తోంది. ఇలాంటి సమయంలో ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టాలి. అందుకు అనుగుణంగా ఆయన రాజీనామా అస్త్రాన్ని వదిలారు. దీనివల్ల ఎంత మేర లాభపడతారో వేచి చూడాల్సి ఉందని" రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# 100 రోజుల్లో.. ఇదీ మా ప్రోగ్రెస్ కార్డు..!

**9 నెలల మీ పాలనలో కాంగ్రెస్ చేసిందేమిటి..?**
**జవాబివ్వకుంటే ప్రజలు కాంగ్రెస్ ను క్షమించబోరు**
**కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్..**

హైదరాబాద్: రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడమే మా లక్ష్యం
మహిళల కోసం రూ.3 లక్షల కోట్లు కేటాయింపు
కనీస మద్దతు ధర కోసం రూ.2 లక్షలు కోట్లు కేటాయించినం
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్.
మోదీ 100 రోజుల ప్రోగ్రెస్ రిపోర్ట్ ను వెల్లడించిన బండి సంజయ్.
హైదరాబాద్ నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని అమలు చేసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇచ్చిన హామీలతోపాటు ప్రజా సంక్షేమం అనేక కార్యక్రమాలు చేపట్టినం. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేదిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళల కోసం రూ.3 లక్షల కోట్ల కేటాయించినం. కనీస మద్దతు ధర కోసం రూ.2 లక్షలు కోట్లు కేటాయించినం. ముద్రా రుణపరిమితిని పెంచినం. రూ.5.36 లక్షల కోట్లతో 3 కోట్ల ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకున్నం. 75 వేల మెడికల్ సీట్లను అదనంగా మంజూరు చేసినం. మూలధన వ్యయం కింద మౌలిక సౌకర్యాల కల్పనుకు రూ.11 లక్షల 11 వేల కోట్లు కేటాయించినం. బంగారం, వెండి, ప్లాటినంపై కస్టమ్స్ ఛార్జీలను తగ్గించినం. ఇవన్నీ మచ్చుకు కొన్ని మాత్రమే. అని వివరించారు. మరి కాంగ్రెస పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలైందని, 6 గ్యారంటీలను కూడా ఎందుకు అమలు చేయలేక పోయిందని ప్రశ్నించారు. 9 నెలల మీ పాలనలో నెరవేర్చిన హామీలపై సమాధానం చెప్పాలని, లేనిపక్షంలో ప్రజలు కాంగ్రెస్ ను క్షమించబోరని అన్నారు. ఈరోజు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర నాయకులతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. మోదీ 100 రోజులపాటు రైతులు, యువత, మహిళలుసహా అన్ని వర్గాల అభ్యున్నతికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడంలో భాగంగా కనీస మద్దతు ధర పెంపు కోసం 2 లక్షల కోట్ల రూపాయలు కేటాయించినం. పీఎం కిసాన్ నిధి ద్వారా 9 కోట్ల 30 లక్షల మంది ఖాతాల్లో 20 వేల కోట్ల రూపాయలు జమ చేసినం. అట్లాగే మహిళల కోసం. నారీ శక్తి పేఎంఏవై కింద 3 లక్షల కోట్ల రూపాయలు కేటాయించినం. 2 లక్షల 35 వేల మంది స్వయం సంఘాలకు చెందిన 26 లక్షల మంది మహిళలను ఆదుకునేందుకు 5 వేల కోట్ల విలువైన బ్యాంకు రుణాలు మంజూరు చేసినం. 4 లక్షల 30 వేల స్వయం సంఘాలకు చెందిన 26 లక్షల మందికి 2 వేల 500 కోట్ల రివాల్వింగ్ ఫండ్ ను విడుదల చేసి ప్రయోజనం చేకూర్చినం. ముద్రా రుణాల పరిమితిని 10 లక్షల నుండి 20 లక్షల రూపాయలకు పెంచినం"అని వివరించారు. యువత అభ్యున్నతిలో భాగంగా 4 కోట్ల 10 లక్షల మంది యువతకు లాభం చేకూర్చేందుకు 2 లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీని ప్రకటించినం. వెయ్యి ఐటీఐలను అప్ గ్రేడ్ చేసి 20 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి ఉద్యోగ, ఉపాధి కల్పించాలని ప్రణాళిక రూపొందించినం.75 వేల కొత్త వైద్య సీట్లు ప్రవేశపెట్టినం.అని పేర్కొన్నారు.

# గంజాయి సాగు రహితమే అందరి లక్ష్యం

**- అల్లూరి జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ వెల్లడి**

అల్లూరి: జిల్లాలో గంజాయి సాగు రహితమే అందరి లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. గంజాయి సాగు నిర్మూలన పై అధికారులకు దిశా నిర్దేశం చేసారు. గంజాయిని సాగు చేసినా , అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్, వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, ఉద్యానవన శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, ఐసిడిఎస్, డ్వామా, డి. ఆర్. డి. ఏ అధికారులతో గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి నిర్మూలన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గంజాయి సాగుపై ఫిర్యాదుల స్వీకరణకు వ్యవసాయ శాఖ, రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖలలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలో గంజాయి వినియోగంపై కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. కళాశాలల్లో అవగాహనా సదస్సులు, డి ఎడిక్షన్ సెంటరుకు ఎంత మంది వచ్చాని సంబంధిత అధికారులను అడిగి తెలుసు కున్నారు. గంజాయి సాగు చేసే రైతులు, సరఫరాదారులుపై ప్రత్యేక దృష్టి పెట్టి అటువంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. గంజాయి విడిచి పెట్టిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, స్వయం ఉపాధి పథకాలు, బ్యాంకు రుణాలు, పశువులు, మేకలను మంజూరు చేయాలని స్పష్టం చేసారు. జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ సమావేశం రోజున గంజాయి వినియోగం వలన వచ్చే ఆరోగ్య సమస్యలపై చర్చించాలని సూచించారు. డి. ఐ. జి గోపీ నాథ్ జెట్టి మాట్లాడుతూ జిల్లాలో గంజాయిని సమూలంగా అరికట్టాలని పేర్కొన్నారు. భావి తరాలకు గంజాయి వలన నష్టం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. గంజాయి నిర్మూలనలో భాగమైన ప్రభుత్వ శాఖలు లక్ష్యాలను నిర్దేశించుకుని పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేసారు. గంజాయిలో భాగ స్వామ్యమైన వారి వివరాలు సేకరిస్తున్నామని అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. సమాజంలో గంజాయి నిర్మూలనపై పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంత చేయాలని చెప్పారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ నిరుద్యోగం ఎక్కువగా ఉందన్నారు. యువతకు స్వయం ఉపాధి పథకాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించవలసిన అవసరం ఉందన్నారు. గిరిజన యువతకు రుణ ప్రణాళికలు అమలు చేయాలని చెప్పారు. జి.మాడుగుల, చింతపల్లి, ముంచంగిపుట్టు, జి.కె. వీధి, కొయ్యూరు మండలాలపై దృష్టి పెట్టాలని చెప్పారు.ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ గంజాయి సాగును విడిచిపెట్టిన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. గిరిజన రైతులకు ఉద్యాన వన పంటలను అందిస్తామన్నారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. మండలాల వారీగా గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై పక్కాగా కార్యచరణ అమలు చేయాలని అన్నారు. మండల స్థాయి, గ్రామ స్థాయి, ఐటిడి ఏ స్థాయిలో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు ప్రధాన మంత్రి ఉపాధి హామీ పథకంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. పి.వి. టి. జిలకు ప్రత్యేకంగా పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ అదనపు ఎస్పీ ధీరజ్, డి ఆర్ ఓ బి. పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్. బి. ఎస్. నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు,గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జమాల్ భాషా, డి. ఆర్. డి. ఏ పి.డి వి. మురళి, ఐసిడి ఏస్ పి.డి సూర్యలక్ష్మి వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లడ్డూను దక్కించుకున్న కుక్క

వరంగల్: గణపతి లడ్డు అనగానే. లడ్డు దక్కించుకోవడం కోసం భక్తులు లక్షలు వెచ్చించి వేలంపాటలో పాల్గొంటారు. అలాంటిది లక్కీ డ్రా లడ్డు దక్కించుకోవడం అంతకంటే అదృష్టం మరొకటి ఉండదు. కానీ వరంగల్ లో ఓ శునకం లక్కీ డ్రాలో గణపతి లడ్డూను కైవసం చేసుకుంది.హనుమకొండ నగరంలోని యూనివర్సిటీ డబ్బాల వద్ద హనుమాన్ భజన మండలి పేరుతో 28 సంవత్సరాలు గణపతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అయితే ప్రతి సంవత్సరం లడ్డును వేలం పాట వేయకుండా 51 రూపాయలు చెల్లించి లక్కీ డ్రా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ సారి లక్కీ డ్రా నిర్వహించారు. హనుమాన్ నగర్ కాలనీకి చెందిన పోలాస వాణి, రాజేష్ దంపతులు కుటుంబ సభ్యులపేర్లతో కూడా లక్కీ డ్రా లో పాల్గొన్నారు. వాణి, రాజేష్ దంపతులు ఓ శునకాన్ని పెంచుకుంటున్నారు. శునకానికి సోను అనిపేరు పెట్టారు. ఇంట్లో కుటుంబ సభ్యులతో సమానంగా సోనును వారు చూసుకుంటున్నారు. లడ్డూ లక్కీ డ్రాలో శునకం సోను పేరు మీద 28 కిలోల లడ్డు దక్కించుకుంది. దీంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేవు. శునకాన్ని గణపతి మండపం వద్దకు తీసుకువెళ్ళి లడ్డూను ఇంటికి తీసుకువచ్చారు.. మా సోను పేరు మీద లడ్డు గెలుచుకోవడం ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.గత ఏడాది గణపతి ఉత్సవాల్లో వాణి, రాజేష్ దంపతుల కూతురు వర్ష పేరు మీద లక్కీ డ్రాలో లడ్డూ దక్కించుకున్నారు.

# గోపాల్ పేట్ లో బీఆర్ఎస్ నిరసన

గోపాల్ పేట్: తెలంగాణ తల్లి విగ్రహస్థానంలో రాజీవ్ విగ్రహ ఏర్పాటుకు నిరసనగా గోపాల్ పేటలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టీ తెలంగాణ తల్లిని అవమానపరిచే విధంగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా పట్టణములో జమ్మి చెట్టు చౌరస్తా నుండి భారీ సంఖ్యలో నాయకులతో మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు గోపాల్ పేట మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహాన్నికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ నిజాం ప్రభుత్వం భారత యూనియన్ నందు విలీనము తర్వాత స్వయం ప్రతిపత్తి కలిగిన హైదరాబాద్ రాష్ట్రాన్ని నెహ్రూ గారి ప్రభుత్వం కుట్రతో ఆంధ్ర,తెలంగాణ ప్రాంతాలను కలిపి సమైక్య రాష్ట్రం చేయడంతో ఆనాటి నుండి స్వరాష్ట్ర కాంక్ష కొరకు ప్రజలు ఉద్యమించి 1969 ప్రారంభమైన ఉద్యమం 1972వరకు పోరాటం చేసి 369 మంది అమరులైనారు. 30ఏండ్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ ప్రజలు అన్ని విధాలుగా నష్టపోతున్న తరుణంలో కె.సి.ఆర్ నాయకత్వములో ప్రజాస్వామ్యయుతంగా జరిగిన ఉద్యమం ప్రబంజనమై తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగింది.10ఏండ్లుగా కె.సి.ఆర్ ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రన్నీ అగ్రభాగాన నిలిపారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారింటీలు,అమలు కాని 420హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 10నెలల కాలంలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా విధ్వంసం చేశారు అని ఆరోపించారు.

ఉచిత బస్సు తప్ప ఒక్క గ్యారంటీ అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెట్టే పరిస్థితి దాపురించింది అని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, వాకిటి.శ్రీధర్,పి.రమేష్ గౌడ్, నందిమల్ల.అశోక్, జాత్రు నాయక్,మాజీ ళి.జూ.బి.ఇ చంద్ర శేఖర్ నాయక్ కౌన్సిలర్స్ బండారు.కృష్ణ, నాగన్న యాదవ్,కంచే.రవి,కో. అప్షన్ సభ్యులు ఉస్మాన్ మండల నాయకులు రఘువర్ధన్ రెడ్డి, రవిప్రకాష్ రెడ్డి,ధర్మానాయక్,మహేశ్వర్ రెడ్డి,మాధవ్ రెడ్డి, దేవర్ల.నరసింహ,గోపాల్ పేట అధ్యక్షులు బి.బాలరాజు ,మాజీ ఎం.పి.పి సంధ్య తిరుపతయ్య,చంద్ర శేఖర్ రాజేష్ గౌడ్,మతీన్,శ్రావణ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు కాదాన్న ప్రభుత్వం అనుమతి

హైదరాబాద్: హైదరాబాద్ హుస్సేన్ సాగర్లో నిమజ్జనం ఏర్పాట్ల విషయంలో రెంత్ రెడ్డి సర్కారు వ్యూహం లెక్క తప్పింది అనే విమర్శలు వినిపిస్తున్నాయి. భక్తుల ఆగ్రహం నుంచి బయటపడేందుకు కోర్టుకు అడ్డంగా దొరికిపోయారా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఏటా హుస్సేన్ సాగర్లో వేలాది విగ్రహాలు నిమజ్జనం చేస్తుంటారు. అయితే తొలిసారి నిమజ్జ ప్రక్రియను చేపట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం తడబాటుకు గురైందని అంటున్నారు విమర్శకులు.ప్రతీ ఏటా నిమజ్జనం టైంలో ఈ ఘర్షణ పూరిత వాతావరణం కనిపిస్తూనే ఉంది. కోర్టుల నిబంధనలు చెప్పి నిజ్జనానికి అడ్డుపుల్లలు వేయడం, తర్వాత మళ్లీ పూజా కమిటీల ఆగ్రహంతో గేట్లు తెరవడం కామన్గా మారిపోతోంది. ఈసారి గత ప్రభుత్వ తీరుకు భిన్నంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరించింది. హైకోర్టు తీర్పుకు ముందు రోజు ట్యాంక్ బండ్పై విగ్రహాల నిమజ్జనం నిషేధం అంటూ బ్యానర్లు పెట్టి, సాగర్ చుట్టూ ఇనుప కంచె, భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. 2021లొ ఇచ్చిన తీర్పు కొనసాగుతుందని కోర్టు చెబుతూ నిమజ్జనం అడ్డుకోవాలనే పిటిషన్ కొట్టివేసింది. అని తీర్పు పిఓపి విగ్రహాలను కూడా నిమజ్జనం చేసి సాగర్ను కలుషితం చేయమని కాదు. సాగరను కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, మట్టి విగ్రహాలు మాత్రమే నిమజ్జనం చేయాలని గతంలో ఇచ్చిన ఆదేశాలకు కొనసాగింపు అన్నమాట. నిమజ్జనాకి? కొద్ది గంటలముందు గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ఆగ్రహంతో బారికేడ్లు తొలిగించడం, ఫ్లెక్సీలు పీకేయ్యడంతో నిమజ్జనానికి లైన్ క్లియర్ అయ్యింది సరే.. కానీ ఇక్కడే అసలు సమస్య మొదలైయ్యింది. ఈరోజు వేలాదిగా విగ్రహాలు ట్యాంక్ బండ్ వద్ద నిమజ్జనం చేస్తున్నారు. హుస్సేన్ సాగర్లో హైదరాబాద్ నలుమూలల నుంచి వచ్చే విగ్రహాలు భారీగానే ఉంటున్నాయి. అందులో పిఓపి విగ్రహాలు ఎక్కువశాతం ఉంటే కొంత వరకూ మట్టి విగ్రహాలు కూడా ఉంటాయి. పిఓపి విగ్రహాల వల్ల సాగర్ కలుషితం అవుతుంది అనే విమర్శల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పిఓపి విగ్రహాలకు ప్రత్యేకంగా నిమజ్జన పాండ్లు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ఈరోజు విగ్రహాల సంఖ్యకు సరిపడా పాండ్లు ఏర్పాటు చేశారా అంటే అంతంతమాత్రమే అది కూడా అరకొరగ ఏర్పాటు చేసిన చిన్న పాండ్లు విగ్రహాల సంఖ్యకు ఏమాత్రం సరిపోవు. మరి పిఓపి విగ్రహాలు కూడా సాగర్లో నిమజ్జనం తప్పదు. హుస్సేన్ సాగర్ కు ప్రత్యాన్మయ ఏర్పాట్లు సాధ్యం కాని పరిస్దితి.సరే నిమజ్జనం వైభవంగా జరిగిపోతుంది. అడ్డుకుంటే భక్తుల వ్యతిరేకతను ప్రభుత్వం తట్టుకోలేదు కాబట్టి చూసి చూడనట్లుగా పోతుంది.కానీ ఇదే ఆరోపణలు కోర్టు దృష్టికి వెళితే కచ్చితంగా కోర్టుకు సమాధానం చెప్పక తప్పదు. సాగర్ రక్షణకు చేపట్టిన ప్రత్యామ్నాయ ఏర్పాట్ల లెక్కలు చూపక తప్పదు. సాగర్ నిమజ్జనాలు, పిఓపి విగ్రహాల ప్రభావం వీడియో ఆధారాలతో సహా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కొత్త చిక్కులు తెచ్చుకున్నట్లే.గణపతి నిమజ్జనం భారీ వేడుకలు..ఈ విషయం ప్రభుత్వ పెద్దలకు ,అధికారులకు తెలుసుకు కానీ, ఏళ్లు గడుస్తున్నా యథారాజా తథా ప్రజా అన్నట్లుగా కళ్ల ముందు సాగర్ కలుషితమవుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నా. అధికారులు చూస్తున్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఆశించన స్దాయిలో చేయకపోవడం ప్రతీ ఏటా రిపీట్ అవుతోంది. ఈసారి కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం గట్టగా ట్రైచేసి నిండా మునిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# ఎన్ఈపీని అమలు చేసే ఆలోచన విరమించుకోవాలి

**- విద్యామంత్రి లేక ఆ వ్యవస్థ అస్తవ్యస్తం**
**- సమస్యల వలయంలో సంక్షేమ వసతి గృహాలు**
**- స్కాలర్షిప్, ఫీజురీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి**
**- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 27న చలో హైదరాబాద్**



హైదరాబాద్: నూతన విద్యా విధానం (ఎన్ఈపీ-2020)ని రాష్ట్రంలో అమలు చేసే ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రి లేకపోవడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్థంగా మారిందని విమర్శించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో సమస్యల వలయంలో సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలున్నాయని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సరిపోయినంత మంది అధ్యాపకుల్లేక ప్రయివేటు కాలేజీలకు విద్యార్థులు వెళ్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ కౌన్సెలింగ్ ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్నదనీ, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో రాష్ట్రంలో మెడికల్ విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. స్థానికతపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలనీ, మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న రూ.8,254 కోట్ల స్కాలర్షిప్, ఫీజురీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బీఆర్ఎస్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పాలన సాగిస్తున్నదని విమర్శించారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా విద్యారంగ సమస్యలపై సమీక్ష చేయకపోవడం వల్ల ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూళ్లలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని పేర్కొన్నారు. అద్దెభవనాల్లో నడుస్తున్న గురుకులాలకు తక్షణమే సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలనీ, వీసీలను నియమించాలని కోరారు. విద్యారంగం, విద్యార్థుల డిమాండ్ల సాధన కోసం ఈనెల 27న 'చలో హైదరాబాద్' 'విద్యార్థి మహాగర్జన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

**- ప్రజాపాలన దినోత్సవం దేనికి సంకేతం?**
**- పోరాటానికా- తెలంగాణ విలీనానికా : సీఎం రేవంత్కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ప్రశ్న**
**- మఖ్దూంభవన్లో సాయుధ రైతాంగ పోరాట వారోత్సవ వేడుకలు**

హైదరాబాద్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరిస్తే సహించబోమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ పనిగట్టుకుని ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు పోరాటం చేశారంటూ ఆ చరిత్రను వక్రీకరిస్తున్నాయని విమర్శించారు.కమ్యూనిస్టుల నేతృత్వంలో హిందువులు, ముస్లింలు కలిసి బందూకులు పట్టి సాగించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వాస్తవ చరిత్ర చెరిగిపోదని చెప్పారు. ఆ పోరాట స్ఫూర్తి ఎప్పుడూ ఈ ప్రాంత ప్రజల గుండెల్లో తిరుగుబాటు చైతన్యాన్ని కలిగిస్తుందన్నారు. మనిషి ఉన్నంత కాలం అరుణ పతాకం రెపరెపలాడుతూనే ఉంటుందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 76వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్లో తెలంగాణ విలీన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను కూనంనేని సాంబశివరావు, అరుణ పతాకాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా ఎగరేశారు. సాయుధ పోరాట అమరవీరులకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పేరు ఉచ్ఛరించడానికి పాలకులకు భయమని అన్నారు. విమోచన దినమంటూ కేంద్ర ప్రభుత్వం, సమైక్యతా దినమంటూ మాజీ సీఎం కేసీఆర్, ప్రజాపాలన దినోత్సవమంటూ ముఖ్యమంత్రి రేవంత్ అంటున్నారని చెప్పారు. ప్రజాపాలన దినోత్సవం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. పోరాటానికి సంకేతమా లేదంటే తెలంగాణ విలీనా నికి సంకేతమా అని సీఎం రేవంత్రెడ్డిని అడిగారు. ప్రజా పాలన పేరుతో నాటి పోరాటం పేరే ఉనికిలో లేకుండా పోయే ప్రమాదముం దన్నారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనం సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం,నిజాం రాజు మధ్య జరిగిన ఒప్పందంలో చట్టబద్ధంగా విలీనం అని పొందపర్చారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వమైనా, రాష్ట్ర ప్రభుత్వమైనా చట్టబద్ధమైన తెలంగాణ విలీన దినోత్సవం పేరుతోనే ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# సంక్రాంతి రష్... రైళ్లు ఫుల్

హైదరాబాద్: సంక్రాంతి పండగకు సొంత గ్రామాలకు వెళ్లాలని ఎక్కువ మంది కోరుకుంటారు. ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద పండగ సంక్రాంతి కావడంతో ఆ సమయంలో ఊళ్లకు వెళ్లాలని ఉత్సాహపడుతుంటారు. ఈసారి వరస సెలవులు సంక్రాంతి పండగకు వచ్చాయి. దీంతో రైళ్ల టిక్కెట్లన్నీ ముందుగానే బుక్ అయిపోయాయి. రిజర్వేషన్లు లేవు. బెర్తులు మొత్తం అయిపోయాయి. ఆంధ్రప్రదేశ్ కు వెళ్లే ప్రతి రైలులోనూ రిజర్వేషన్ టిక్కెట్లు అయిపోవడంతో ఇక వెయిటింగ్ లిస్ట్ మాత్రమే చాంతాడంత మిగిలింది. సంక్రాంతికి నాలుగు నెలలు ముందుగానే ఓపెన్ చేసిన వెంటనే టిక్కెట్లన్నీ బుక్ కావడంతో రైల్వే అధికారులు సయితం ఆశ్యర్యపోతున్నారు. హైదరాబాద్ నుంచి బయలుదేరే అన్ని రైళ్లలోని టిక్కెట్లు వెంటనే కొనుగోలు చేశారు. సింహపురి, కోణార్క్, గౌతమి, శబరి, గోదావరి, ఫలక్‌నుమా, గరీబ్‌రథ్, ఈస్ట్‌కోస్ట్, చార్మినార్, వందేభారత్ రైలుతో సహా అన్ని రైళ్లలో సీట్లు భర్తీ అయిపోయాయి. వచ్చే ఏడాది జనవరి 11 నుంచే టిక్కెట్లన్నీ బుక్ అయిపోయాయి. 11వ తేదీ శనివారం కావడం, 12 ఆదివారం రావడంతో ఆ తర్వాత పండగ మూడు రోజులు సొంతూళ్లలో గడపొచ్చని ముందుగానే బుక్ చేసుకున్నారంటే నిజంగానే ఇది ఆశ్యర్యకరమైన విషయమంటున్నారు. రైల్వే శాఖ రైల్వే శాఖ అధికారులు. ఎందుకంటే గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి అ?దని అంటున్నారు. మరోవైపు దక్షిణ మధ్య రైల్వే సంక్రాంతి పండగను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకరైళ్లను ఏటా వేస్తుంది. వాటిని ముందుగానే వేస్తే తాము అడ్వాన్స్ గా బుక్ చేసుకుంటామని చెబుతున్నారు. అయితే రైల్వే అధికారులు ప్రయాణికుల రద్దీని బట్టి రైళ్ల సంఖ్యను పెంచే అవకాశముంది. అయితే స్పెషల్ ట్రెయిన్స్ ఎప్పుడు అన్న క్లారిటీ రాకపోవడంతో ముందుగానే ఆర్టీసీ, ప్రయివేటు బస్సులను కొందరు ఆశ్రయిస్తున్నారు. ప్రయివేటు బస్సులు కూడా సంక్రాంతి పండగకు వెళ్లేందుకు అధిక డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో మరింత ధరలు పెరిగే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతుంది. అందుకే దక్షిణ మధ్య రైల్వే అధికారులు ముందుగానే స్పెషల్ ట్రైన్స్ అనౌన్స్ చేసి ప్రజలను ఆర్థిక భారం నుంచి బయటపడేయాలని కోరుకుంటున్నారు. మరికొందరు కార్ పూలింగ్ కు కూడా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం, విజయవాడ, శ్రీకాకుళం, నెల్లూరు ప్రాంతాలకు వెళ్లే వారు 11వ తేదీన తమ కారులో బయలుదేరవచ్చన్న పోస్టింగ్ లు నెట్టింట కనపడుతున్నాయి. దీంతో ఈ సారి సంక్రాంతి రద్దీ మామూలుగా ఉండదని నాలుగు నెలల ముందుగానే తేలిపోయింది. మొత్తం మీద ఈసారి సంక్రాంతి ప్రయాణ కష్టాలు ప్రజలకు తప్పేట్లు లేవు.

# హ్యాట్రిక్ పై కమలం గురి

ఛండీఘడ్: హర్యానాలో ఎన్నికలకు ఇంకా పెద్దగా సమయం లేదు. అన్ని రాజకీయ పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను దాదాపుగా ప్రకటించేసి ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. అగ్రనేతలు కూడా హర్యానాలో పర్యటిస్తూ తమకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. మ్యానిఫేస్టో బలంగా జనంలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ప్రధానంగా హర్యానాలో ఈసారి కాంగ్రెస్, బీజేపీల మధ్య పోటీ నెలకొని ఉందని చెప్పకతప్పదు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా అధికారంలోకి వచ్చేటంత సీట్లు రాకపోవడంతో కాంగ్రెస్ పార్టీ రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో పాల్గొంటుంది. నేటితో నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తి కానుంది. హ్యాట్రిక్ విజయం కోసం... వచ్చే నెల 1వ తేదీన హర్యానా శాసనసభకు ఎన్నికలు జరుగుతాయి. అక్టోబరు 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఇప్పటికే కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. హర్యానాలో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. వరసగా రెండు విడతలుగా అధికారంలోకి వచ్చిన బీజేపీ ఈసారి హ్యాట్రిక్ విజయం సాధించాలని కోరుకుంటుంది. అందుకోసం ప్రజలను ఆకట్టుకునే విధంగా మ్యానిఫేస్టోను రూపొందించింది. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతూ ప్రజల్లోకి చొచ్చుకెళుతుంది. అదే సమయంలో బీజేపీ కేంద్ర నాయకత్వం మాత్రం తమకు అధికారాన్ని అప్పగిస్తే నాయబ్ సింగ్ సైనీని మరోసారి ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించింది. ఇలా బీజేపీ అనేక వ్యూహాలతో హర్యానా ఎన్నికలకు వెళుతుంది. కాంగ్రెస్ నమ్మకం ఇదే... కాంగ్రెస్ కూడా హర్యానా ఎన్నికలపై గంపెడు ఆశలు పెట్టుకుంది. ఈసారి కేంద్ర ప్రభుత్వం పై ఉన్న వ్యతిరేకత తమ విజయానికి కారణమవుతుందని గట్టిగా కాంగ్రెస్ పార్టీ విశ్వసిస్తుంది. సీనియర్ నేతలను పరిశీలకులుగా దింపడమే కాకుండా అగ్రశ్రేణి నేతలు తమ పార్టీ తరుపున ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పదేళ్ల కమలనాధుల పాలన నుంచి ప్రజలు విముక్తి కావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం నెలకొల్పడమే మార్గమమని ప్రధానంగా ప్రచారంలో పేర్కొంటుంది. ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెబుతుంది. ప్రధానంగా రైతులను కేంద్రప్రభుత్వం మభ్యపెట్టేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈసారి వారు తమ వైపు మొగ్గు చూపుతారని విశ్వసిస్తుంది. ఆమ్ ఆద్మీ పార్టీ తరుపున కూడా అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీల మధ్యనే ఉందన్నది రాజకీయ విశ్లేషకుల అంచనాగా వినిపిస్తుంది. మరి ఎవరిది గెలుపు అన్నది మాత్రం అక్టోబరు 4వ తేదీ వరకూ వేచి చూడాల్సిందే.

**హోరా హోరి ప్రచారంలో పార్టీలు**

హర్యానా, జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంఇ. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. దీంతో ప్రచారంలో అన్నిపార్టీలు నిమగ్నమయ్యాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలు విడుదల చేస్తున్నాయి. బీజేపీ ఇప్పటికే జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి సంబంధించిన మేనిఫెస్టోను ప్రకటించింది. ఇక ఇప్పటికే అధికారంలో ఉన్న హర్యానాను నిలబెట్టుకునేందుకు యత్నిస్తోంది. మరోవైపు కాంగ్రెస్ కూడా లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల జోష్‌తో ఇటు హర్యానాలో, అటు జమ్మూ కశ్మీర్‌లో పాగా వేయాలని చూస్తోంది. ఈ క్రమంలోనే హరియానా ఎన్నికల కోసం ప్రత్యేకంగా ముగ్గురు సీనియర్ నేతలను పరిశీలకులుగా నియమించిందిహర్యానా అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులుగా ఏఐసీసీ నియమించిన వారిలో రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాట్, పార్టీ సీనియర్ నాయకులు అజయ్ మాకెన్, పర్తాప్ సింగ్ బజ్వాలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. హరియానాలో ఆప్‌తో పొత్తు కోసం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో 90 స్థానాలు ఉన్న హర్యానాలో 89 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను నిలబెట్టింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(మార్కిస్ట్)కు ఒక స్థానం కేటాయించింది. ఇదిలా ఉంటే.. హర్యానాలో అధికార బీజేపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. రాష్ట్రంలో పదేళ్లుగా బీజేపీ అధికారంలో ఉంది. రెండ పర్యాయాలు విజయం సాధించింది. అయితే ఈసారి బీజేపీకి కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. నాలుగు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 10 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ చెరో ఐదు గెలిచాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కూడా గెలుపుపై ధీమాగా ఉంది. అయితే బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు ప్రస్తుతం ఆప్ కూడా పోటీలో ఉంది. దీంతో త్రిముఖ పోరులో తమకే లాభం కలుగుతుందని బీజేపీ భావిస్తోంది. ఇదిలా ఉంటే.. హర్యానా అసెంబ్లీ ఎన్నికలు అక్టోబర్ 5న నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. ఎన్నికల బరిలో వివిధ పార్టీల తరఫున 1,561 మంది నామినేషన్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థులతో కలిసి 1,747 మంది నామినేషన్లు వేశారు.

# 19 నుంచి అందుబాటులోకి రానున్న వందే భారత్ ట్రైన్స్

హైదరాబాద్: మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా భారత రైల్వే శాఖ.. రైలు మార్గాలపై ప్రత్యేక దృష్టిసారించింది. ప్రయాణికులను ఆట్టుకునేలా అత్యాధునిక సౌకర్యాలతో, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో వందే భారత్ రైళ్లను రూపొందించింది. ఏడాదిగా వందే భారత్ రైళ్లు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పరుగులు పెడుతున్నాయి. తెలుగు రాష్ట్రాలు అయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కూడా కేంద్రం వందే భారత్ రైళ్లను కేటాయించింది. తాజాగా మరో రెండు రైళ్లను రెండు తెగులు రాష్ట్రాల మీదుగా నడపాలని నిర్ణయించింది. ఈమేరకు రూట్లు ఖరారు చేసింది. సెప్టెంబర్ 16న ఒకేసారి ఆరు వందే భారత్ రైళ్లను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో తెలుగు రాష్ట్రాలకు కేటాయించిన రెండు వందే భారత్ రైళ్లు కూడా ఉన్నాయి. ఈనెల 19 నుంచి ఈ రైళ్లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం తెలుగ రాష్ట్రాల్లో నడుస్తున్న ఇంటర్‌సిటీ రైళ్ల స్థానంలో వందే మెట్రో రైళ్లు నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. దేవంలో తొలి వందే మెట్రో సర్వీసు ప్రారంభం అవుతుంది. అహ్మదాబాద్?భుజ్ మధ్య దీనిని ప్రారంభిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు వందే మెట్రో రైళ్లు నడిపే రూట్లను రైల్వే శాఖ అధికారికంగా ఖరారు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం నుంచి దుర్గ్ మధ్య ఒక వందే మెట్రోరైలు నడుపుతారు. తెలంగాణలోని సికింద్రాబాద్ నుంచి నాగపూర్ మధ్య మరో సర్వీస్ నడుపుతారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన తొలి వందే మెట్రో రైలును తిరుపతితో అనుసంధానం చేయనున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి?చెన్నై మధ్య తొలి వందే మెట్రో రైలు పట్టాలెక్కనుంది. తర్వాత వరంగల్ మీదుగా సికింద్రాబాద్?విజయవాడ మధ్య మరో వందే మెట్రో రైలు నడుపుతారు. ప్రస్తుతం ఈ రెండు రూట్లలో నడుస్తున్న ఇంటర్‌సిటీ స్థానంలో అదే సమయంలో వందే మెట్రో రైళ్లను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వందేభారత్ సేవలు మరింత మెరుగుపడతాయి. 100 నుంచి 300 కిలోమీటర్ల దూరంలో ఉండే రెండు ప్రధాన నగరాల మధ్య నడిచేలా ఈ వందే మెట్రో రైళ్లను రూపొందించారు. వీటి గరిష్ట వేగం గంటకు 110 కిలోమీటర్లు ఉంటుందివందే మెట్రోరైళ్లు పూర్తిగా ఏసీ రైళ్లు. భవిష్యత్‌లోనాన్ ఏసీ రైళ్లను కూడా నడపనున్నారు. ఈ రైళ్లలో కనీస ఛార్జీ రూ.30. దూరాన్ని బట్టి చార్జీ మారుతుంది. 350 కిలోమీటర్లకు రూ.445గా నర్ణయించారు. ఈ రైళ్లలో ఆటోమేటిక్ డోర్ సిస్టమ్, ప్రయాణికులకు అనువైన సీటింగ్ ఉంటుంది. ఈ రైలులో నాలుగు ఏసీ బోగీలు ఒక యూనిట్‌గా ఉంటాయి.

# రాంకొండ గ్రామంలో ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమం

## పంచాయతీ కార్యాలయం ముందు మొక్కలు నాటిన రాంకొండ ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు

తుగ్గలి: తుగ్గలి మండలం పరిధిలోని గల రాంకొండ గ్రామంలో ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమం సందర్భంగా జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పత్తికొండ శాసనసభ్యులు కేయి శ్యామ్ కుమార్ ఆదేశాల మేరకు రాంకొండ గ్రామ పంచాయతీ మాజీ ప్రెసిడెంట్ తుగ్గలి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మసాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాంకొండ గ్రామ పంచాయతీ జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు సమక్షంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో మంగళవారం రోజున మొక్కలను నాటారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ హెచ్.నాగరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ భాగంలో చెట్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని,ఈరోజు మనం నాటిన మొక్కలే రేపటి మన భవిష్యత్ జీవన ప్రమాణానికి నాంది అవుతాయని,భూమి మీద నివసిస్తున్న అన్ని జీవరాసులకు మొక్కలే జీవనాధారం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తుగ్గలి మండల అధ్యక్షుడు వెంకటేష్,మేటి మహేష్,బోయ చిట్యాల కాశిమ్,కొమ్ము బజారి,రాకేష్. నేరేడుజల్ల వెంకటేష్, అనిత్,అనిల్,నేరేడుజల్లా కాశినాథ్,పవన్ కుమార్ మరియు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఈ సీ రేసులో ఆ నలుగురు..?

హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ విషయంలో ప్రభుత్వం ఏం చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత కమిషనర్ పార్థసారథి పదవీ కాలం నేటితో ముగియనుంది. ఆయనను మరో ఏడాది కొనసాగిస్తారా? లేక కొత్త వారిని నియమిస్తారా? అన్నది వేచి చూడాలి. కొత్త కమిషనర్ నియామకానికి విశ్రాంత ఐఏఎస్ అధికారుల పేర్లను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే అన్ని స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న తరుణంలో ఎస్ఈసీ నియామకం కీలకం కానుంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారిధి పదవీకాలం ముగియటంతో కొత్త ఎన్నికల కమిషనర్ నియమించాలని భావిస్తోంది సర్కార్. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ గా ప్రభుత్వం ఎవరిని నియమిస్తుందన్న చర్చ సెక్రెటెరియట్ బ్యూరోక్రాట్స్‌లో జోరుగా సాగుతోంది. ఈ పదవికి రిటైర్డు ఐఏఎస్ అధికారిని నియమించడం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి జరుగుతుంది. ప్రభుత్వంలో ముఖ్య కార్యదర్శి హోదాలో పని చేసి ఉండాలనేది నిబంధన. 1994 లో రూపొందించిన సర్వీసు రూల్స్ ప్రకారం స్టేట్ ఎలక్షన్ కమిషనర్ పదవీకాలం కనీసం 5 ఏళ్లు.. గతంలో కమిషనర్లుగా పని చేసిన కాశీ పాండ్యన్, ఏవీఎస్ రెడ్డి, కాకి మాధవరావు, రమాకాంత్ రెడ్డి, నాగిరెడ్డి లాంటి వాళ్లు ఆ పదవిలో పూర్తికాలం అంటే ఐదేళ్లపాటు కొనసాగారు. కాగా, అప్పటి ప్రభుత్వాలు కూడా రూల్స్ కు లోబడి అందరూ ఐదేళ్లు విధులు నిర్వర్తించేలా ఉత్తర్వులు ఇచ్చాయి. ఐతే, ఒక్క పార్థసారథి విషయంలో అలా జరగలేదు. 2020 లో వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి హోదాలో పదవీవిరమణ చేశాక, అప్పటి ప్రభుత్వం ఆయనను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ గా నియమించింది. గతానికి భిన్నంగా ఆయన ఆ హోదాలో మూడేళ్ల పాటు కొనసాగుతారని ఆదేశాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగా ఎస్ఈసీ కమిషనర్‌గా పార్థసారథి పదవీకాలం 2023 సెప్టెంబర్ 8తో పూర్తైంది. అయితే కేసీఆర్ ప్రభుత్వం పార్థసారథి పదవీ కాలాన్ని అప్పట్లో ఏడాది పాటు పొడిగించింది ? పొడిగించిన పదవీకాలం కూడా ముగిసింది.. 2020 సెప్టెంబర్ 9 నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్న పార్థసారథి గత నాలుగేళ్లుగా ఆ బాధ్యతల్లో కొనసాగారు. మరో ఏడాది పాటు కమిషనర్‌గా కొనసాగే అవకాశం ఆయనకు ఉంది. పార్థసారథి పదవీకాలం పొడగింపుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఎస్ఈసీగా పనిచేసిన అధికారి ఒక టర్మ్ లో గ్రామ పంచాయితీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్, జీహెచ్ఎంసీలకు.. అంటే 5 రకాల స్థానిక సంస్థలకు తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలనే స్ఫూర్తితో 1994 లో ప్రభుత్వం కమిషనర్ పదవీకాలాన్ని ఐదేళ్లుగా నిర్ణయించిందని మాజీ ఈసీలు అభిప్రాయపడుతున్నారు. పార్థసారథి ఇప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేదు. దాంతో ఈ ఏడాదిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటంతో ఆయన పదవీకాలం మరో ఏడాది పొడిగించే అవకాశం ఉందంటున్నారు. ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంతో పార్థసారథి ఎలక్షన్ కమిషన్ ఆఫీసు వ్యవహారాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇప్పుడు ఎస్ఈసీ కొత్త కమిషనర్ గా ప్రభుత్వం ఎవరిని నియమిస్తుందన్న చర్చ అధికారవర్గాల్లో జరుగుతోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ పోస్టు కీలకంగా మారింది. ఇందుకోసం అనేక మంది రిటైర్డు అధికారుల పేర్లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయంటున్నారు. చిరంజీవులు, జగదీశ్వర్, జగన్ మోహన్, ఆర్వీ చంద్రవదన్, శశిధర్ లాంటి వారి పేర్లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయంటున్నారు. తెలంగాణా క్యాడర్ కు చెందిన వీళ్లంతా గతంలో ప్రభుత్వంలో కీలక శాఖలు నిర్వర్తించిన వాళ్లే.. కాగా, వీళ్ళతో పాటు ఈ మధ్యే పదవీ విరమణ చేసిన మరికొందరు అధికారులు కూడా ఉన్నా, వాళ్లకు ప్రభుత్వం ఆ అవకాశం ఇవ్వకపోవచ్చని తెలుస్తోంది. అలాంటి వాళ్లలో రాణి కుముదిని, అధర్ సిన్హా, రజత్ కుమార్, సోమేష్ కుమార్, సునీల్ శర్మ, నిర్మల ఉన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల కోసం తెలంగాణాకు సంబంధించిన ఆఫీసర్ ఉంటే మంచిదన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వంలో విధులు నిర్వర్తిస్తూ, వచ్చే సంవత్సరం రిటైరయ్యే అధికారుల పేర్లను కూడా ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉందంటున్నారు. అలాంటి వాళ్లలో ప్రస్తుత చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు ముందు వరుసలో కనిపిస్తున్నారు. వీళ్లలో ఒకరికి స్వచ్ఛంద పదవీ విరమణ ఇచ్చి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ గా పంపాలనే ఆలోచనలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ శాంతి కుమారిని అక్కడికి పంపితే, రామకృష్ణా రావుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా అవకాశం లభిస్తుందంటున్నారు.. అలాకాక తెలంగాణా ఆఫీసర్ ను ఎస్ఈసీకి పంపాలని ముఖ్యమంత్రి రేవంత్ భావిస్తే రామకృష్ణా రావుకు కమిషనర్ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. కాగా, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నియామకం కోసం పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఒక ముసాయిదా దస్త్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపినట్లు తెలుస్తోంది. మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం ఇందుకు సంబంధించిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి ఒక అధికారి పేరును ఖరారు చేసి ఆ ఫైల్లో రాసి తిరిగి పీఆర్ అండ్ ఆర్డీ శాఖకు పంపితే క్యాబినెట్ ఆమోదంతో ఆ ఫైల్ రాజ్ భవన్ కు వెళ్తుంది. రాజ్యాంగపరమైన పదవి కావడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ను నియమిస్తూ గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేస్తారు. అయితే నిబంధనల ప్రకారం ప్రస్తుతం ఆ బాధ్యతలు నిర్వర్తిస్తున్న పార్థసారథికి ఆ పదవిలో మరో ఏడాది కొనసాగే అర్హత ఉండటంతో.. ప్రభుత్వం ఆయన్నే కొనసాగిస్తుందా..? లేక మరో అధికారిని నియమిస్తుందా? అన్నది చూడాలి.

# మూడు పార్టీలకు ప్రతిష్ఠాత్మకం....

నిజామాబాద్: త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎన్నికలు మూడు ప్రధాన పార్టీలకు సవాల్ గా మారనున్నాయి. ఇప్పటికే ఆశావాహులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే కాంగ్రెస్ మరోసారి సిట్టింగ్ ఎమ్మెల్సీ అవకాశం ఇస్తుందా లేదా అనేది ఆసక్తిగా మారింది. ఇక బిఆర్ఎస్,బిజెపి బలమైన అభ్యర్థులను బరిలో నిలుపేందుకు ప్లాన్ చేస్తున్నారు.. ఇండిపెండెంట్ అభ్యర్థులు మేము సైతం అంటున్నారు. మొత్తానికి ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా సాధారణ ఎన్నికలు తలపించనున్నాయి.. త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎన్నికల పై ప్రధాన పార్టీలు ఫోకస్ చేస్తున్నాయి. ఇప్పటికే ఆశావాహులు పోటి చేయడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండడంతో.. ఆయా పార్టీల మద్దతుదారులకు ట్రై యాంగిల్ ఫైట్ నెలకోనే అవకాశం ఉంది. కొన్ని నెలల్లోనే కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవి కాలం ముగియనుంది. అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీ మరోసారి సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి టిక్కెట్ ఇస్తుందా లేదా అనేది మాత్రం ఆసక్తిగా మారింది. కాంగ్రెస్ అధికారంలో ఉండడం, గ్రాడ్యుయేట్ సెగ్మెంట్ పరిధిలో ఆ పార్టీకి సంబందించిన ఎమ్మెల్యేలుండడంతో కలిసి వస్తుందని ఆశావాహులు భావిస్తున్నారట. దీంతో టిక్కెట్ పై ఆశలు పెరుగుతున్నాయి. అయితే కాంగ్రెస్ కొత్త వారికి అవకాశం ఇస్తుందా? లేదా జీవన్ రెడ్డికి ఛాన్స్ ఇస్తుందా అనేది స్పష్టత రావాల్సి ఉంది. గతంలో కంటే పార్టీ బలం పుంజుకోవడంతో ఈసారి బలమైన అభ్యర్థికి టికెట్ ఇచ్చి గెలుపించుకోవాలని భారతీయ జనతా పార్టీ ప్లాన్ చేస్తోంది. ఈసారి బీజేపీలోను ఆశావాహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ప్రధానంగా సుగుణాకర్ రావు, రంజిత్ మోహన్, జగిత్యాల మాజి మున్సిపల్ చైర్మన్ భోగ శ్రావణి, బాస సత్యనారాయణ తోపాటు ఆదిలాబాద్, మెదక్, నిజామాబాదు కు చెందిన నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆశావాహులు పార్టీ టిక్కెట్ కోసం ఆశిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ లోనూ ఆశావాహులు ఎక్కువగానే ఉన్నారు. కరీంనగర్ మాజీ మేయర్ రవిందర్ సింగ్ ఇప్పటికే పోటిలో ఉన్నంటు ప్రచారం చేసుకుంటున్నారు. అదే విధంగా ప్రముఖ డాక్టర్ బీఎన్ రావు బీఆర్ఎస్ టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నారట. అయితే బీఆర్ఎస్ గెలిచే వారికి టిక్కెట్ ఇచ్చి.. వారికి సపోర్టుగా ముమ్మర ప్రచారం సాగించేలా ప్లాన్ చేస్తోందట. ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాలను బరిలోకి నిలుపాలని ఇప్పటి నుంచే ప్లాన్ చేస్తుంటే.. ప్రముఖ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీకి సై అంటున్నారట. అయితే.. జాతీయ పార్టీలు టికెట్ ఇస్తే బరిలోకి దిగుతానని స్పష్టం చేస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈసారి రసవత్తరంగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులకు పోటీగా.. ఇండిపెండెంట్ అభ్యర్థులు బరిలోకి దిగే అవకాశం ఉంది. మరి టిక్కెట్ ఇవ్వకపోతే సిట్టింగ్ ఎమ్మెల్సీ రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి. ఉత్తర తెలంగాణలో ఈ ఎన్నికలు కీలకంగా మారనున్నాయి. ఇక్కడ మూడు పార్టీ లు బలంగా ఉన్నాయి. అంతేకాకుండా మూడు పార్టీల కీలక నేతలకు సవాలుగా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పైచేయి సాధించగా. బీజేపీ ఎంపీ ఎన్నికల్లో ఈ ఎమ్మెల్సీ పరిధిలో నాలుగు ఎంపీ సీట్లు గెలిచి.. సత్తాను చాటింది. బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చినా.. ఎంపీ ఎన్నికల్లో ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయింది. దీంతో ఈ మూడు పార్టీలకు ఈ ఎన్నికలు కీలకంగా మారాయి.

# తెలంగాణకు అఖండ వారసత్వం వుంది

సిద్దిపేట: అనాది కాలం నుండి తెలంగాణకు అత్యంత వైభవమైన చరిత్ర ఉంది. అఖండమైన వారసత్వం ఉంది. దేశంలోనే పేరు పొందిన శాతవాహన చక్రవర్తుల పాలనకు తొలి మూలాలు తెలంగాణలోనే ఉన్నాయి. తెలుగు తత్వానికి తెలంగాణ అస్తిత్వానికి ఆకృతి ఇచ్చిన కాకతీయ నిర్మాణాత్మక ప్రజారంజక పాలనకు పునాదులు తెలంగాణలోనే ఉన్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం అయన ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ భారతీయ జీవన విధానానికి ఊపిరి విభిన్నత. వైవిధ్యత. ప్రథమ ప్రధాని నెహ్రూ చెప్పినట్లు బిన్నత్వంలో ఏకత్వం భారతీయ విశిష్టత ! హిందూ, ముస్లిం, సిక్కు, క్రిస్టియన్, బౌద్ధం, జైనం ఇతర మతాల సంస్కృతుల సంగమ స్థలం మనదేశం! మన దేశానికి ప్రతిరూపం లాంటిది తెలంగాణ.

తెలంగాణ ప్రాంతంలో హిందూ, ముస్లిం సహజీవన సంస్కృతి పరస్పర గౌరవం ఎంతగానో విరాజిల్లుతున్నాయి. మహాత్మా గాంధి అంతటి మహనీయుడు తెలంగాణ ప్రాంత జీవన వైవిధ్యతను గమనించి గంగా జమున తెహజీబ్ అని ప్రశంసించారు.

బౌగోళికంగా కూడా తెలంగాణ ఉత్తర భారతం దక్షిణ భారతాలకు మధ్య సంధానంగా ఉంది. తెలంగాణ అంటే ఇప్పుడు ఒక మినీ ఇండియా. ఇలా గొప్ప చారిత్రాత్మక వారసత్వం, మహోన్నత పాలన విధానాలకు కొలువైన తెలంగాణ 1948వ సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీన సువిశాల భారతదేశంలో అంతర్భాగంగా మారి రాచరిక పరిపాలన నుండి ప్రజలచే పాలించబడే ప్రజాస్వామ్య దశలోకి పరివర్తన చెందింది. అందుకు యావత్ తెలంగాణ సమాజం అద్భుతంగా కృషి చేసిన విషయం మనందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా ఆనాటి వీరయోధులైన కొమరం భీమ్, దొడ్డి కొమురయ్య, రావి నారాయణరెడ్డి, స్వామి రామానంద తీర్థ, సర్దార్ జమలాపురం కేశవరావు, వట్టికోట ఆళ్వార్ స్వామి, చాకలి ఐలమ్మ, భీంరెడ్డి నర్సింహారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, బద్దం ఎల్లారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రజాకవి కాళోజి, మగ్దూం మొహియొద్దీన్, షోయబుల్లాఖాన్, బండి యాదగిరి, దాశరథి కృష్ణమాచార్య, సుద్దాల హనుమంతు ఇంకా ఎందరో మహానుభావులు వారందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

భారతదేశంలో తెలంగాణ అంతర్భాగంగా మారిన తర్వాత 1948 నుండి 1952 వరకు కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉండగా, 1952 లో జరిగిన ఎన్నికలలో శ్రీ బూర్గుల రామకృష్ణా రావు నేతృత్వంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడి 1956 వరకు సొంత రాష్ట్రంగా హైదరాబాద్ రాష్ట్రం కొనసాగింది. మిగులు నిధులు గల హైదరాబాద్ రాష్ట్రం ఆనాడే అభివృద్ధి దిశగా ప్రణాళికలు నిర్మించుకొని ముందుకు సాగింది.

ఈ క్రమంలోనే తెలంగాణ సాధన కోసం అనేక రాజకీయ పార్టీలు పురుడు పోసుకుని తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగస్వాములయ్యాయి. మలిదశ తెలంగాణ ఉద్యమం కొత్త పుంతలను తొక్కింది.

తెలంగాణ ఉద్యమంలో కవులు, సాహితీవేత్తలు, మేధావులు, విద్యార్థులు, కళాకారులు, సాంస్కృతిక ప్రతినిధులు కీలకపాత్ర వహించారు. తెలంగాణలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తెలంగాణ అస్తిత్వం, చైతన్యాన్ని వ్యాప్తి చేయడానికి తోడ్పడ్డారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయ రీతుల్లో ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడంలో వీరు ఎంతో కృషి చేశారు. తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ సమాజంలోని కవులు, రచయితలు, కళాకారుల్ని ఒక వేదిక వైపు తీసుకువచ్చిందని అయన అన్నారు.

# పేలుతున్న మాటలు, తూటాలు

హైదరాబాద్: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ఏడాది కావొస్తున్నా.. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మాత్రం ఆగడం లేదు. ఎన్నికల వరకే రాజకీయాలు.. ఎన్నికల తర్వాత అభివృద్ధి అని నేతలు చెబుతున్నా.. పరస్పరం మాటల తూటాలు పేల్చుకుంటున్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పుడు అధికార పార్టీలోకి వెళ్తున్నారు. ఇప్పటికే పది మంది పార్టీ మారారు. ఇంకా ఎంత మంది మారతారో చెప్పలేని పరిస్థితి. అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ చేపట్టాలని హైకోర్టు ఇటీవలే అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మరోమారు ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం.. కాస్త చేతల వరకు వెళ్లింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు చీరలు కట్టుకుని గాజులు వేసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చీర, గాజులు చూపించారు. పీఏసీ చైర్మన్‌గా పారీ మారిన అరికెపూడి గాంధీని నియమించడంపై మండిపడ్డారు. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానన్న అరికెపూడి గాంధీ ఇంటికి వెళ్లానని సవాల్ చేశారు. ఇక్కడే మాటలు కోటలు దాటి చేతల వరకు వెళ్లాయి. గాంధీ ఇంటికి వెళ్లకుండా పోలీసులు కౌశిక్‌రెడ్డిని అడ్డుకున్నారు. తర్వాత గాంధీ తన అనుచరులతో కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. దీంతో ఇరు పక్షాల మధ్య దాడి జరిగింది.దాడిని సీఎం రేవంత్‌రెడ్డి మొదట కండించారు. దాడులతో బీఆర్ఎస్ హైదరాబాద్ ఇమేజ్ దెబ్బతీయాలని చూస్తోందన్నారు. దాడి అనంతరం పాడికౌశిక్‌రెడ్డి చేసిన ఆంధ్రా వ్యాఖ్యలను హైలెట్ చేశారు. ప్రజల మధ్య ప్రాంతీయ వాదం సృష్టించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అంతే కాకుండా పీసీసీ చీఫ్‌గా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ సందర్భంగా గాంధీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలోనూ సీఎం రేవంత్‌రెడ్డి.. మరోమారు గాంధీ అనుచరులు చేసిన దాడిని సమర్థించారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరి జోలికి వెళ్లరని, తమ జోలికి వస్తే చూస్తూ ఊరుకోరని పరోక్షంగా గాంధీ పేరు ఎత్తకుండా మాట్లాడారు. ఇంటికి పిలిచి తన్నించుకుంటున్నారని ఎద్దేవా చేశారు.ఇదిలా ఉంటే.. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై పాడి కౌశిక్‌రెడ్డి స్పందించారు. సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు పీసీసీ అధ్యక్ష పదవి కోసం రేవంత్‌రెడ్డి తన కాళ్లు పట్టుకున్నాడని ఆరోపించారు. తనకుమద్దతు ఇవ్వాలని బతిమిలాడారని గుర్తు చేశారు. ఇప్పుడు సీఎం కాగానే ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తాను సీఎంతో కాంప్రమైజ్ కానని స్పష్టం చేశారు. రేవంత్‌ను సీఎం పీఠం నుంచి దించే వరకూ పోరాడతానన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు స్థాయి కూడా రేవంత్‌కు లేదని విమర్శించారు. సీఎం వీధి రౌడీలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తాను హత్యకు గురైతే అందుకు రేవంత్‌రెడ్డే బాధ్యుడని స్పష్టం చేశారు.

# గాంధీ ఇప్పుడు ఏ పార్టీ...

హైదరాబాద్: పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫైట్‌లో అధికార పార్టీ ఓ రకమైన గందరగోళం సృష్టిస్తోంది. అదేసమయంలో ఆ పార్టీ కూడా అదే గందరగోళంలో చిక్కుకుంటోందన్న టాక్ వినిపిస్తోంది. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేను అనర్హత వేటు నుంచి తప్పించేందుకు పీఏసీ చైర్మన్‌గా నియమించిన అధికార పార్టీ నేతలు? బీఆర్ఎస్ అభ్యంతరంతో రకరకాల వాదనలు వినిపిస్తున్నారు.పీఏసీ చైర్మన్ గాంధీ తమ వాడేనని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యనిస్తే? ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య వివాదంతో తమకేం సంబంధమని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవి వంటి వారు భిన్న వాదనలు వినిపిస్తున్నారు.

దీంతో గాంధీ విషయంలో కాంగ్రెస్ స్టాండ్ ఏంటనే చర్చ మొదలైందివరుసగా మూడుసార్లు గెలిచిన ఎమ్మెల్యే గాంధీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ విషయాన్ని ఆయన తన ట్విటర్ అకౌంట్‌లో స్పష్టంగా తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా గాంధీని పార్టీలో చేర్చుకున్నట్లు ప్రకటన చేశారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి కూడా గాంధీ తమ పార్టీ నేతగానే చూస్తున్నామనేలా వ్యాఖ్యలు చేశారు. కానీ, కాంగ్రెస్ మంత్రులు ఇందుకు భిన్నమైన వాదనలు వినిపిస్తున్నారు.ఇదే సమయంలో సీఎం, ఆయన సలహాదారు, వివాదానికి కారణమైన ఎమ్మెల్యే గాంధీ అప్పుడు.. ఇప్పుడు ఒకే రకమైన ప్రకటనలు చేయడంతో గాంధీ కాంగ్రెస్ నేతగానే పరిగణించాల్సివుంటుందని అంటున్నారు పరిశీలకులు. ఇదే సమయంలో విపక్షానికి ఇవ్వాల్సిన పీఏసీ చైర్మన్ పదవిని గాంధీకి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లోగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిన తర్వాత? ఎమ్మెల్యేలు గాంధీ, కౌశిక్‌రెడ్డి మధ్య వివాదం చెలరేగింది. కోర్టు తీర్పు వచ్చిన నాడే గాంధీని పీఏసీ చైర్మన్‌గా నియమించడం ఈ వివాదానికి అసలు కారణం. హైకోర్టు తీర్పు నేపథ్యంలో పార్టీలో చేరిన పది మంది ఎమ్మెల్యేల రక్షణకు వారిని ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని భావిస్తున్న కాంగ్రెస్? ఆ గ్రూపులో ఒక ఎమ్మెల్యేను పీఏసీ చైర్మన్‌గా నియమించి? వారు బీఆర్ఎస్‌లోనే మరో వర్గంగా కొనసాగుతున్నట్లు చూపాలని భావించిందంటున్నారు. ఈ కారణంతోనే శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు? ఎమ్మెల్యే గాంధీతో తమ పార్టీకి సంబంధం లేనట్లు వ్యాఖ్యానించారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం కౌశిక్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిలో ఎమ్మెల్యే గాంధీ తప్పేమీ లేదన్నట్లు చేసిన వ్యాఖ్యలే చర్చనీయాంశంగా మారాయి. కౌశిక్‌రెడ్డి రెచ్చగొట్టడం వల్లే తమవారు అలా వ్యవహరించాల్సివచ్చిందన్నట్లు చెప్పడం ద్వారా గాంధీ తమ వాడేనన్న సంకేతాలు పంపారు సీఎం రేవంత్‌రెడ్డి.. దీంతోనే కాంగ్రెస్‌లో ఏమైనా గందరగోళం కొనసాగుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో ఎలాంటి స్ట్రాటజీ అమలు చేయాలన్న దానిపై అధికార పార్టీలో స్పష్టమైన విధానం తీసుకోలేదా? అనే సందేహిస్తున్నారు. ఇలాంటి కన్ఫ్యూజన్ ఉంటే ఎలా అని కాంగ్రెస్ వర్గాల్లోనే భిన్నవాదనలు వినిపిస్తున్నాయి.

# పొలిటికల్ ఎపిసోడ్‌ను టర్న్‌చేసుకునే ప్రయత్నం

హైదరాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య యుద్ధంలో బీజేపీ ఎంట్రీ తెలంగాణ పొలిటిక్స్‌లో రకరకాల అనుమానాలకు తెరలేపింది. పార్టీ ఫిరాయింపుల ఎపిసోడ్‌లో ఇద్దరు ఎమ్మెల్యేల గొడవ హాట్ హాట్‌గా సాగుతుండగా, ఈ రగడకు ఓ మంత్రి కారణమనే అర్థం వచ్చేలా ట్వీట్ చేసిన బీజేపీ వివాదాన్ని ఇంకో టర్న్ తిప్పింది. ఆ రెండు పార్టీల మధ్యలోకి బీజేపీకి ఎందుకొచ్చింది..? రాష్ట్ర మంత్రిని ఎందుకు టార్గెట్ చేసింది? పొలిటికల్ ఎపిసోడ్‌ను తనవైపు టర్న్‌చేసుకునే ప్రయత్నమా?పార్టీ ఫిరాయింపులు.. వలస ఎమ్మెల్యేల అనర్హతపై మూడు రోజులుగా జరుగుతున్న రచ్చను బీజేపీ మరో మలుపు తిప్పిందంటున్నారు. ఈ ఎపిసోడ్‌లో తమ పార్టీ వెనకబడిందనే ఆలోచనతో ఉన్న కమలనాథులు? ఎమ్మెల్యేల రగడలోకి తాము ఎంట్రీ ఇవ్వడంతోపాటు కాంగ్రెస్‌లోని సీనియర్ నేతలను లాగడమే రాజకీయంగా ఇంట్రెస్టింగ్‌గా మారింది.రెండు పార్టీల మధ్య రాజకీయ గొడవలో బీజేపీ జోక్యం చేసుకోవడంపైనే రకరకాల చర్చ జరుగుతుండగా, అందులోకి కాంగ్రెస్ మంత్రులను ఇన్వాల్వ్ చేయడం వెనుక అసలు ఉద్దేశమేంటని నేతలు ఆరా తీస్తున్నారు. ఎవరి మేలు కోరి బీజేపీ ఇలాంటి స్కెచ్ వేసింది? మూడు రోజుల రచ్చలో తమ పార్టీ చర్చ లేదనే ఆలోచనతోనే ఎంట్రీ ఇచ్చిందా? లేక ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు.రాష్ట్ర బీజేపీలో కొందరు పెద్దలకు.. కాంగ్రెస్ ప్రభుత్వంలోని కీలక నేతలకు మధ్య సత్సంబంధాలు ఉన్నాయనే ప్రచారం ఉంది. ఈ ప్రచారానికి తగ్గట్టే కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ మెతక వైఖరి వహిస్తుందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఇదే సమయంలో బీఆర్ఎస్, బీజేపీ మధ్య అవగాహన ఉందని కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తోంది. ఇలా ప్రతి పొలిటికల్ ఇష్యూలోనూ మూడు పార్టీల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు వినిపించేవి. ఐతే తాజా పొలిటికల్ రచ్చలో ఎక్కడా బీజేపీ పాత్ర కనిపించలేదు.అసలు ఆ పార్టీ నేతల మాట్లాడేందుకు కూడా చాన్స్ దక్కలేదు. ఈ పరిస్థితుల్లో పొలిటికల్‌గా తమ పార్టీ ఉనికిని చాటుకోవాలని డిసైడ్ అయిన కమలనాథులు?. ఇష్యూని డైవర్ట్ చేసేలా ప్లాన్ చేశారంటున్నారు. అందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వెనుక కాంగ్రెస్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నారనే ఆలోచన కల్పించేలా ఎక్స్‌లో ట్వీట్ చేశారు కమలనాథులు. బీజేపీ అధికారిక ఖాతాలోనే ఈ ట్వీట్ చేయడం ద్వారా మూడు రోజులుగా కొనసాగుతున్న రచ్చ తనవైపు టర్న్ అయ్యేలా చేశారు బీజేపీ నేతలు. తమ పార్టీ ఉనికి చాటుకునే ప్రయత్నంలో బీజేపీ నేతలు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌ను ఎందుకు టార్గెట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలకు బీజం వేయాలనే ఆలోచనతోనే బీజేపీ ఈ విధంగా ట్వీట్ చేసిందని హస్తం పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారు. అయితే ఇందుకోసం మంత్రి ఉత్తమ్‌ను ఎంచుకోవడమే ఎవరికీ అంతుచిక్కడం లేదు. మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బంధుత్వాన్ని రాజకీయాలకు ముడిపెట్టడమేంటని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది.వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో బలపడి ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని ప్లాన్ చేస్తున్న బీజేపీ? ఆ స్థాయిలో పనితీరు కనబరచడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండటంతో ఎక్కువగా రాష్ట్ర రాజకీయాలపై దృష్టి పెట్టలేకపోతున్నారు. దీంతో బీజేపీ నేతలు ఎవరికివారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు వంటివారు అప్పుడప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ తామున్నామనే భావన కల్పిస్తున్నా.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాడిన స్థాయిలో ఇప్పుడు పోరాడటం లేదని అంటున్నారు.దీంతో ఎమ్మెల్యేల రగడలోకి ఉద్దేశపూర్వకంగా బీజేపీ చొరబడిందని అంటున్నారు.

ఇందుకోసం రాష్ట్రంలోని సీనియర్ మంత్రిని లక్ష్యంగా చేసుకుంటే? ఇష్యూలోని సీరియస్‌నెస్ పెంచొచ్చని ప్లాన్ చేసివుంటుందని అంటున్నారు. ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో ఉత్తమ్‌కు బంధుత్వం ఉండటం వల్ల ఆయనను టార్గెట్ చేయడం ద్వారా రెండు పార్టీలను ఇరుకున పెట్టొచ్చని బీజేపీ వ్యూహం పన్నిందని అంటున్నారు. అనుకున్నట్లే పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతున్నప్పటికీ అది బీజేపీనే ఇబ్బందుల్లోకి నెట్టిందనే చర్చ సాగుతోంది. కాంగ్రెసులోని మరెవరికోసమో ఉత్తమ్‌ని బీజేపీ టార్గెట్ చేసిందనే గుసగుసలు ఆ పార్టీలోనే వినిపిస్తున్నాయి. మరోవైపు బీజేపీ ట్వీట్ తో ఆత్మరక్షణలో పడిన కాంగ్రెస్ ఎలాంటి ఎదురుదాడి చేస్తుందనేది చూడాల్సివుంది.

# సన్నాలకు ఫుల్ గిరాకీ

నిజామాబాద్: వ్యవసాయ ఈసారి వరి సాగు రైతుల పాలిట సి రులు కురిపించబోతోంది.. రాష్ట్రంలో సన్నరకం వరిధాన్యానికి డిమాండ్ పెరుగుతూ వస్తోంది. వ్యాపారులు వరికోతలకు ముందుగానే రైతులకు కొంతమొత్తం నగదు అ డ్వాన్సుగా చెల్లించి తామే ధాన్యం కొనుగోలు చేస్తామని ఒ ప్పందాలు కుదుర్చు కుంటున్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయరంగం పట్ల తీసుకున్న సానుకూల నిర్ణయాలు రైతులకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చుతున్నాయి. సన్నరకం వరిసాగు విస్తీర్ణతను పెంచాల న్న లక్షంతో ప్ర భుత్వం రైతులకు బోనస్ ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో రైతులు ఈ సారి దొడ్డు రకం ధాన్యం స్థానంలో పెద్ద ఎత్తు న సన్నరకం ధాన్యం పండించేందుకు మొగ్గు చూపారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ కింద 57లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేయించాలని ప్రభుత్వం ప్రాథమిక లక్ష్యాలను నిర్దేశించుకుంది. అయితే వరినాట్ల సీజన్ ముగింపు ధశకు చేరకుంది. ఇప్పటికే వరినాట్లు 59లక్షల ఎకరాలకు మిం చాయి. ప్రభుత్వ ప్రాథమిక లక్షలో ఇప్పటికే వరిసాగు విస్తీర్ణం 104.52శాతానికి చేరుకుంది. మరో వారం పదిరోజుల్లో వరిసాగు 60లక్షల ఎకరాలకు చేరుకునే అవకాశాలు ఉన్నట్టు వ్యవసాయశాఖ అంచనా వేసింది.రాష్ట్రంలో ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ముందస్తుగా నాటు వేసిన ప్రాంతాల్లో అక్టోబర్ చివరి నుంచి వరికోతలు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సన్నరకం ధాన్యానికి పెరిగిన డిమాండ్ నేపథ్యంలో ప్రైవేటు వ్యాపారులు వరికోతలకు ముందుగానే మేల్కొంటున్నారు. రైతులతో ధాన్యం కొనుగోళ్లకు అగ్రిమెంట్లు కుదుర్చుకుని అ డ్వాన్సులు చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే కొ న్ని జిల్లాల్లో క్వింటాలు ధాన్యానికి రూ.2600నుంచి రూ. 2800 చొప్పున ధరతో అగ్రిమెంట్లు చేసుకుంటున్నట్టు స మాచారం. వాతావరణ పరిస్థితలను బట్టి ఎకరానికి ఈ సారి 30క్వింటాళ్ల వరకూ దిగుబడి లభించే అవకాశాలు ఉన్నట్టు ముందస్తు అంచానా లు వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరమీద రూ.500అదనంగా చెల్లిస్తామని ప్రకటించింది. దీంతో ప్రైవేటు వ్యాపారులు సన్నరకం ధాన్యం కోసం ముందుగానే పోటీలు పడుతున్నారు.రాష్ట్రంలో సాగులోకి వచ్చిన వరిలో 60శాతం మేరకు సన్నరకాలే ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం సన్నరకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ధర ప్రకటించటం వరిసాగు రైతుల్లో పెద్ద మార్పున కు బీజం వేసింది. ఈ సారి అధికంగా తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్15048), వరంగల్ సాంబ, వరంగల్ సన్నాలు, సాంబా మసూరి(బిపిటి5204)చ జగిత్యాల ,హెచ్ఎంటి ,మార్టూరు సాంబ, ఎంటియు, సోమనాథ్, కరీంనగర్ సాంబ, అజన, ప్రత్యూమ్న, సుంగంధ సాంబ, కేపిఎస్,రాజేంద్రనగర్4, కూరం, సిద్ది, జేజిఎల్, తదితర33రకాల సన్నవరిని రైతులు సాగు చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో ఈ సారి 4.75 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి.

నిజామబాద్ జిల్లాలో 4.29లక్షల ఎకరాలు, సూర్యాపేట జిల్లా 3.34లక్షల ఎకరాలు. సిద్దిపేట జిల్లాలో 3.41లోల ఎకరాలు, కామారెడ్డిజిల్లాలో 3.11లక్షల ఎకరాలు, జగిత్యాల జిల్లాలో 3లక్షలు, మెదక్‌లో 2.81లోలు, కరీంనగర్‌లో 2.73లక్షలు సాగులోకి వచ్చాయి. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో కూడా గత ఏడాది ఖరీఫ్‌కంటే ఈ సారి ఖరీఫ్‌లో సన్నరకం వరిసాగువైపే రైతులు మొగ్గు చూపారు.

# గులాబీలో హరీష్‌రావుకు కీలక బాధ్యతలు


హైదరాబాద్: అధికారం కోల్పోయాక బీఆర్ఎస్‌లో సమీకరణలు పూర్తిగా మారిపోతున్నాయి. ఉద్యమకాలం నుంచి మొన్నటి లోక్‌సభ ఎన్నికల వరకు కారుని పరుగులు పెట్టించిన కేసీఆర్.. స్టీరింగ్ వదిలేసి ఫాంహౌస్‌కి పరిమితమయ్యారు. అప్పట్లో చిన్నబాస్‌గా ఫోకస్ అయిన కేటీఆర్ ప్రెస్‌మీట్లు, సోషల్‌మీడియా పోస్టులతో సరిపెట్టేస్తున్నారు. సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లో హరీష్‌రావు దూకుడు గులాబీశ్రేణుల్లో జోష్ నింపుతోంది. గులాబీ పార్టీకి అన్నీతానే అయినట్లు వ్యవహరిస్తున్న హరీష్‌రావును ప్రశంసలతో ముంచెత్తుతూ ఆయన అభిమానులు సోషల్ మీడియాలో చేస్తున్న హడావుడితో గులాబీ బాస్ ఇక రిటైర్ మెంట్ తీసుకున్నట్లేనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పాడి కౌశిక్‌రెడ్డి ఎపిసోడ్లో నేను సైతం అంటూ ఎంటర్ అయి సైబరాబాద్ సీపీ కార్యాలయం ముందు ఆందోళన చేసిన తన్నీరు హరీష్‌రావుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ టైంలో జరిగిన తోపులాటలో ఆయన గాయపడ్డారు. సదరు వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. హరీష్ అభిమానులు దాన్ని లైకులు, షేర్లతో వైరల్ చేస్తున్నారు.పోరాటం మన వారసత్వమని మరవకు సోదర.. థాంక్యూ రేవంత్.. మళ్లీ ఉద్యమం చేసే అవకాశం మా యువతకు ఇచ్చావ్.. మీడియా, సోషల్ మీడియా అంతగా లేనప్పుడే ఉద్యమాన్ని ఉరకలెత్తించినం. ఇప్పుడు అన్ని ఉన్నాయి. చూస్కో మళ్ల.. ఆగం ఐతున్న మా రాష్ట్రం కోసం తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న ప్రతీ యువత కదులుతం.. అంటూ హరీష్‌రావుకి సంఘీభావం ప్రకటిస్తున్నారు.తెలంగాణ ఉద్యమ కాలం నాటి వేడి గుర్తొచ్చే బ్యాక్‌గ్రౌండ్‌తో హల్‌చల్ చేస్తున్న ఆ వీడియోని చూస్తూ బీఆర్ఎస్‌లోని సీనియర్లు, ఉద్యమకారులు ఉద్యమకాలం నాటి రోజులు గుర్తుచేసుకుంటున్నారు. 2009 నవంబరు 29న కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కసం ఆమరణదీక్షకు కూర్చున్నారు. తెలంగాణ వచ్చుడో? కేసీఆర్ సచ్చుడో అన్న నినాదంతో ఆరోజు కేసీఆర్ హడావుడి చేశారు.. అందుకే నవంబర్ 29ను దీక్షా దివస్ అని పిలుచుకుంటుంటాయి గులాబీ శ్రేణులు.. ఇప్పుడు హరీష్ వీడియోని చూస్తూ అప్పటి కేసీఆర్‌ని యాద్ చేసుకుంటున్నాయి అంతలావున హడావుడి చేసి సావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చానని చెప్పుకున్న కేసీఆర్‌ని రెండు సార్లు ముఖ్యమంత్రిగా చూసిన ప్రజలు. ఇక చాల్లే అని పక్కన పెట్టేశారు. తెలంగాణ జాతిపితగా తన అనుచరులతో పిలుపించుకున్న కేసీఆర్ ఆ పరాభవంతో కారు స్టీరింగ్ వదిలేసి ఫాంహౌస్‌లో సెటిల్ అయిపోయారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అటు పార్టీలో ఇటు ప్రభుత్వంలో నెంబరు టూగా కేటీఆర్ చక్రం తిప్పారు. నెక్ట్స్ సీఎంగా పార్టీ నేతలు ఆయన్ని ఫోకస్ చేసుకున్నారుఇప్పుడు బీఆర్ఎస్‌లో హరీష్‌రావు శకం ప్రారంభమైనట్లు కనిపిస్తుంది. పార్టీపై గ్రిప్ కోసం స్పీడ్ పెంచుతున్నారు. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ పార్టీలో కేసీఆర్, కేటీఆర్‌లు గుర్తుకురాకుండా దూకుడు పెంచుతున్నారు. కేసీఆర్ లేని గ్యాప్ పూడుస్తూ హరీష్ రావు ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి పోరాటాలు అంటే హరీష్‌రావుతో కేటీఆర్ పోటీ పడలేరన్నది నిజంగానే వాస్తవం.పరిస్థితుల్లో తన్నీరు హరీష్ రావు ఏ చిన్న అవకాశం దొరికినా వదలకుండా దానిని తనకు అనుకూలంగా మల్చుకుంటున్నారు. కేసీఆర్ వెయిన్ స్ట్రీమ్‌లో నుంచి వెళ్లిపోయినప్పటి నుంచి నుంచి హరీష్ రావు అదే దూకుడు ప్రదర్శిస్తున్నారు. గులాబీ శ్రేణులకు కల్వకుంట్ల తండ్రి కొడుకులు లేని లోటు కనిపించకుండా చేస్తున్నారు. ఆ క్రమంలో బీఆర్ఎస్‌లో కల్వకుంట్ల దొర శకం ముగిసి తన్నీరు వారి హవా మొదలైందన్న టాక్ వినిపిస్తుంది.

# మరో ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

## తెలంగాణకు తప్పదా....

మహబూబ్ నగర్: కృష్ణానదికి ప్రధాన ఉపనదిగా ఉన్న తుంగభద్ర నదిపై మరో నీటిపారుదల ప్రాజెక్టుకు పునాదులు పడబోతున్నాయి. అంధ్రప్రదేశ్ , కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో ఈ ప్రాజెక్టును నిర్మించబోతున్నారు. రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖల అధికారుల మధ్యన ప్రాథమిక చర్చ లు పూర్తయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మంత్రాలయం నుంచి పంచముఖి వెళ్లే మార్గంపై రాకపోకలు సాగేందుకు వీలు గా కూడా ఈ ప్రాజెక్టును ఉపయోగించనున్నారు. బ్రిడ్జికం రిజర్వాయర్‌గా ఈ ప్రాజెక్టు ను నిర్మించేందుకు డిపిఆర్ సిద్ధం చేయాలని నిర్ణయించారు. కృష్ణా నది బేసిన్ పరిధిలో మహారాష్ట్ర , కర్ణాటక , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. అయితే కృష్ణా నదీజలాలను ఉపయోగించుకోవాలంటే బేసిన్ ప రిధిలో ఉన్న ఈ నాలుగు రాష్ట్రాల భాగస్వామ్యంతోనే నిర్ణయాలు జరగాల్సివుంది. ఉ మ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయాక కృ ష్ణానదీ జలాలకు సబంధించిన తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నీటివాటాలపై ఇప్పటికే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌లో వాదనలు నడుస్తున్నాయి. రెండు రాష్ట్రాల మధ్య నీటి వినియోగంపై సమన్వయం నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం కృష్ణానదీయాజమా న్య బోర్డును నియమించింది.కృష్ణా నది ప రివాహకంగా ఉన్న ప్రాంతంలో తుంగభద్ర నదిపై ఏ కొత్త ప్రాజెక్టు నిర్మించాలన్న తొలు త కృష్ణాబోర్డులో ప్రతిపాదించాల్సివుంది . తెలంగాణ , ఏపి ప్రభుత్వాల మధ్య ఏకాభిప్రాయం ద్వారానే ఏ ప్రాజెక్టుకైనా అనుమతి పొందాల్సివుంది.అంతేకాకుండా కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి అధ్యక్షతన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు స భ్యులుగా ఉన్న అపెక్స్ కౌన్సిల్‌లో కూడా చ ర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సివుంది. అయితే ఇవేవి లేకుండానే తెలంగాణ రాష్ట్రం తో నామమాత్రంగానైనా చర్చించకుండా, క నీసం సమాచారం కూడా ఇవ్వకుండా ఆం ధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు ముం దుకు పోతున్నాయి. బ్రిడ్జికం బ్యారేజి నిర్మాణంతో తుంగభద్ర నదిలో జలదోపిడికి సిద్ధమవుతున్నాయి.కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ నీ టిపారుదల శాఖ మంత్రి బోసరాజు, రాయచూర్ ఎంపి కుమార్ నాయక్ ,కర్నూలు జిల్లా ఎంపి పంచలింగాల నాగరాజుతోపాటు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖల అధికారుల మధ్య మంత్రాలయంలో చర్చలు జరిగాయి. తుంగభద్ర నదీజాలను రెండు రాష్ట్రాల్లోని కర్నూలు, రాయచూర్ జిల్లాల్లో ఉపయోగించుకునేందుకు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నారు. నదిలో బ్రిడ్జికం రిజర్వాయర్ నిర్మించటం ద్వారా ఎన్ని టీఎంసీల నీ టిని నిలువ చేసుకునే అవకాశాలు ఉన్నా యి, రెండు రా?రష్ట్రాల్లో ఎన్ని లక్షల ఎకరాల కు సాగనీటిని అందించే వీలుంది తదితర వి వరాలపై సమగ్ర సర్వే నిర్వహించనున్నారుతుంగభద్ర నదిపై మంత్రాలయం వద్ద బ్రిడ్జికం బ్యారేజి నిర్మాణం వల్ల ఆ ప్రభావం తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్టులపై పడనుంది.కృ ష్ణాపై తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టులుగా ఉన్న శ్రీశైలం , నాగార్జున సాగర్ ప్రాజెటలకు కృష్ణానది తర్వాత దాదాపు తుంగభద్ర నదినుంచే అధికంగా నీటి లభ్యత ఉంటుంది. కృ ష్ణానది బేసిన్ పరిధిలో తెలంగాణ , ఆధ్రప్రదేశ్ రాష్ట్రాలకు జస్టిస్ బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811టిఎంసీల నీటి కేటాయిం పుల్లో ఏటా 250టిఎంసీలనుంచి 350టిఎసీ ల వరకూ తుంగభద్ర నదిద్వారానే నీటి ల భ్యత ఉంటోంది. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, తుమ్మిళ్ల ఎత్తిపోతల ప థకం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప థకం, శ్రీశైలం ఎడమగట్టు కాలువ పథకం , నాగార్జున సాగర్ ఎడమ కాలువ తదితర వాటి ద్వారా తెలంగాణ రాష్ట్రంలో లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సివుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టులకు కేటాయింపుల మేరకు నికర జలాలు కూడా అందటం లేదు. గత ఏడా ది సాగునీటి పారుదల మాట అటుంచి తాగునీటి అవసరాలకు సైతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కర్ణాటక ప్రభుత్వాన్ని బతిమాలు కోవాల్సివచ్చింది.ఈ పరిస్థితు ల్లో తెలంగాణకు ఎగువన ఆంధ్రప్రదేశ్ , కర్నాటక రాష్ట్రా లు తుంగభద్ర పై మరో కొత్త ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ప్రభావం తెలంగాణ రాష్ట్ర రైతాంగం పైనే కాకుండా తాగునీటి కోసం అన్ని వర్గాల ప్రజలపైన పడనుంది.

# జానీ మాస్టర్ వివాదం.. స్పందిచిన ఫిల్మ్ ఛాంబర్



హైదరాబాద్: జానీ వివాదంపై తాజాగా ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ స్పందించారు. పరిశ్రమలోని లైంగిక వేధింపుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు 2018 నుంచి లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.మహిళా కొరియోగ్రాఫర్ నుండి వచ్చిన ఫిర్యాదును ప్యానల్ స్వీకరించినట్లు చెప్పారు. తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌లో ప్రముఖ కొరియోగ్రాఫర్ మీద వచ్చిన ఫిర్యాదును పరిష్కరించడానికి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు విచారణ ప్రక్రియలో ఉన్నట్లు చెప్పారు. అందువల్ల విచారణ పూర్తి అయ్యే వరకు సదరు మగ కొరియోగ్రాఫర్‌ను యూనియన్‌లో ప్రెసిడెంట్ పోస్ట్ నుంచి తప్పించాలని ఇప్పటికే ఫెడరేషన్‌ను ఆదేశించినట్లు తెలిపారు.

లైంగిక వేధింపుల ఫిర్యాదుల విషయంలో మహిళలు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను సంప్రదించవచ్చునన్నారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం వెలుపల ఫిర్యాదు పెట్టె ఉంచినట్లు చెప్పారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**